ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
శుక్రవారం 25 అక్టోబరు 2024



28 నుంచి బీఎస్ఎన్ఎల్ వారోత్సవాలు

అరసవల్లి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు పారదర్శకమైన, మెరుగైన సేవలందించడమే లక్ష్యంగా ఈ నెల 28 నుంచి నవంబరు 3 వరకు బీఎస్ఎన్ఎల్ అవగాహన వారోత్సవాలను నిర్వహించనున్నట్టు జనరల్ మేనేజర్ ఎం.నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సంస్థకు సంబంధించిన అవినీతిపై ఫిర్యాదులను కూడా స్వీకరిస్తామన్నారు. వినియోగదారులు తమ ఫిర్యాదులను శ్రీకాకుళంలోని ఉప మండల ఇంజనీర్(విజిలెన్స్), జనరల్ మేనేజర్ కార్యాలయం, సంచార భవన్‌కు పంపాలని సూచించారు. మరిన్ని వివరాలకు 08942-26700, 9441668789 నెంబర్లను సంప్రదించాలని కోరారు.



చివరికి గండం గట్టెక్కేనా?

జలుమూరు మండలంలో పచ్చిధాన్యాన్ని లోడింగ్ చేస్తున్న రైతులు

- దానా తుఫాన్‌తో అన్నదాతల గుండెల్లో గుబులు
- ధాన్యం భద్రపరిచేందుకు అవస్థలు
- వాతావరణానికి భయపడి పచ్చి ధాన్యం విక్రయాలు

నరసన్నపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అల్పపీడనం ప్రభావంతో వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. మబ్బులు కమ్ముకుని.. గాలులు వీస్తున్నాయి. దానా తుఫాన్ నేపథ్యంలో రానున్న మూడు రోజులు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించింది. దీంతో రైతుల్లో గుబులు మొదలైంది. వరి పంట కోత దశకు చేరుకుందని.. ఈ తరుణంలో తుఫాన్ ముప్పు వెంటాడుతోందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో ఏటా ఖరీఫ్‌లో 4.50లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తారు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో 3.80లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. నందిగాం, టెక్కలి, కవిటి, ఇచ్ఛాపురం, కంచిలి, వజ్రపుకొత్తూరు, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి, మందస, పోలాకి, నరసన్నపేట, జలుమూరు, నందిగాం తదితర మండలాల్లో బుధవారం మధ్యాహ్నం నుంచి తేలికపాటి గాలులు వీస్తున్నాయి. దీంతో జిల్లాలో పలు ప్రాంతాల్లో వరిపైరు నేలకొరిగింది. తుఫాన్ ముప్పు కూడా పొంచి ఉండడంతో కొంతమంది రైతులు వరిపంటను కాపాడుకునేందుకు ఆపసోపాలు పడుతున్నారు. పంట కోత కోసి.. నూర్పులు చేపట్టారు. ధాన్యాన్ని భద్రం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. పాతపట్నం, సారవకోట, జలుమూరు, నరసన్నపేట మండలాల్లోని చాలా గ్రామాల్లో కోతలు పూర్తయ్యాయి. ధాన్యాన్ని ఆరబెడుతున్నారు. కొంత మంది తాము పూర్తిగా నష్టపోకూడదనే ఉద్దేశంతో పచ్చి ధాన్యాన్ని దళారీలకు విక్రయిస్తున్నారు. ఇదే అదనుగా 85 కేజీల బస్తా ధాన్యాన్ని దళారీలు రూ.1,300 నుంచి రూ.1,400 వరకు కొనుగోలు చేస్తున్నారు. కాగా ఈ ఏడాది దిగుబడి ఆశాజనకంగా వస్తుందని భావిస్తే.. తుఫాన్ రూపంలో తమకు నష్టం తప్పేలా లేదని రైతులు వాపోతున్నారు. కాగా.. గురువారం నాటికి గాలులు తప్ప వర్షం లేకపోవడంతో.. దానా తుఫాన్ గండం నుంచి కాస్త గట్టెక్కినట్టేనని ఊరట చెందుతున్నారు.



నారాయణవలస వద్ద ఆరబెట్టిన ధాన్యం భద్రపరుస్తున్న రైతులు

వర్షం పడితే అపార నష్టం..



అల్పపీడన ప్రభావంతో వర్షం పడితే రైతులకు అపారమైన నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. ప్రకృతి కన్నెర చేస్తుందోమోనన్న భయంతో నిద్ర పట్టడం లేదు. దిగుబడులు కూడా తగ్గే అవకాశం ఉంది.

-కొత్తరెడ్డి కృష్ణారావు, రైతు

'దానా' ప్రభావం లేనట్టే!

- ఈ ఒక్కరోజు గడిస్తే చాలు
- స్వల్పంగా ఈదురుగాలులు
- వేకువజాము వరకూ ఉద్దానం ప్రజల్లో ఆందోళన
- ఒడిశా వైపు మళ్లిన తుఫాన్

6 లో

హైవే విస్తరణకు రూ.252.42 కోట్లు

- రణస్థలం వద్ద ఆరు లేన్ల రహదారి నిర్మాణానికి నిధుల కేటాయింపు
- ఫలించిన కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు చొరవ



కేంద్రమంత్రులు నితిన్ గడ్కరీ, రామ్మోహన్ నాయుడు

శ్రీకాకుళం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి విస్తరణకు మార్గం సుగమమైంది. 'నరసన్నపేట-శ్రీకాకుళం- విశాఖపట్నం' మధ్య కీలకంగా ఉన్న ఈ రోడ్డు నిర్మాణాలు పూర్తి చేయాలని కోరుతూ కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి కేంద్రంపై తెచ్చిన ఒత్తిడి ఫలించింది. ఈ మేరకు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న రణస్థలం వద్ద హైవే విస్తరణకు కేంద్ర ప్రభుత్వం రూ.252.42కోట్లు మంజూరు చేసింది. ఇందుకు సంబంధించిన వివరాలను కేంద్రమంత్రి కార్యాలయం గురువారం విడుదల చేసింది. ప్రధానమంత్రి మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో రాష్ట్ర అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనపై పలు కీలక ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు. ఇందులో రాజధాని నగరం అమరావతి నుంచి రూ.2,245 కోట్లతో రైల్వే లైన్ నిర్మాణానికి ఆమోదం తెలపగా.. జిల్లాలో రణస్థలం వద్ద హైవే విస్తరణకు సవరణలతో కూడిన ప్రతిపాదనలు సిద్ధం చేసింది. దీనిలో భాగంగా రూ. 252.42 కోట్లు కేటాయించింది.

- జాతీయ రహదారి-16లో విశాఖపట్టణం- శ్రీకాకుళం- (మిగతా 6వ పేజీలో...)



రణస్థలం వద్ద హైవే

'ఆంధ్రజ్యోతి' కథనాలకు స్పందన

రణస్థలం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రణస్థలంలో జాతీయ రహదారికి సంబంధించి ఫ్లైఓవర్ వంతెన నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.252.42 కోట్లు మంజూరు చేయడంపై ఈ ప్రాంతవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. విశాఖ జిల్లా ఆనందపురం నుంచి శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట వరకూ జాతీయ రహదారిని ఆరులైన్లుగా విస్తరించారు. నాలుగేళ్ల కిందటే దీనికి సంబంధించి నిర్మాణాలు పూర్తయ్యాయి. కానీ రణస్థలం మండల కేంద్రానికి సంబంధించి బైపాస్ నిర్మించాలా? లేకుంటే ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టాలా? అని జాతీయ రహదారుల సంస్థ తీవ్ర తర్జనభర్జన పడింది. వైసీపీ విపక్షంలో ఉన్నప్పుడు బైపాస్ నిర్మాణానికి ముందుకొచ్చిన రైతులకు పరిహారం విషయంలో రెచ్చగొట్టే ధోరణితో వ్యవహరించింది. తీరా అధికారంలోకి వచ్చిన తరువాత పట్టించుకోవడం మానేసింది. గత ఐదేళ్లుగా ఇక్కడి విషయంలో నాన్చుతూ వచ్చింది. 'ఆంధ్రజ్యోతి' సామాజిక బాధ్యతగా పలుమార్లు కథనాలు ప్రచురించింది. ఈ నేపథ్యంలో స్పందించిన కేంద్ర ప్రభుత్వం ఇక్కడ ఫ్లైఓవర్ నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది.

న్యూస్ బాక్స్

'ఎస్‌బీఐ' బంగారం కేసుపై 'సీఎంవో' ఆరా!

శ్రీకాకుళం క్రైం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): గార ఎస్‌బీఐ కేసు మరోసారి తెరపైకి వచ్చింది. ఈ బ్యాంకులో తాకట్టు బంగారం మాయం కేసు విచారణపై రాష్ట్ర ముఖ్యమంత్రి పరిపాలన కార్యాలయం నుంచి ఆరా తీశారు. 'గతంలో చేపట్టిన ఈ కేసు దర్యాప్తులో లొసుగులు ఉన్నాయి. సాక్ష్యాధారాలు అందించిన బ్యాంకు ఉద్యోగినిని ఇరికించారు. ఆమె ఆత్మహత్యకు పాల్పడేలా చేశారు. ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న కొంతమంది ఉద్యోగులను కేసు నుంచి తప్పించారు' అని సీఎం కార్యాలయంలోని 'మీ కోసం'లో జూలై 20న బాధిత కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. అలాగే గత నెల 24న విజయవాడలో రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనితను కలిసి తమకు న్యాయం చేయాలని వినతిపత్రం అందజేశారు. దీంతో అర్థాంతరంగా నిలిచిన ఈ కేసును పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని సీఎం, హోంశాఖ కార్యాలయాల నుంచి ఆదేశాలు వచ్చాయి. ఈ మేరకు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో డీఎస్పీ సీహెచ్ వివేకానంద ఈ కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. ఇప్పటికే ఈ కేసులో అప్పటి ఆర్ఎం రాజు ఇచ్చిన వాంగ్మూలాలు పోలీసులకు అంతుచిక్కని ప్రశ్నలుగా మిగిలిపోయాయి. ఆడిట్‌లో సైతం లోపాలు ఉన్నట్లు పోలీసుల విచారణలో గుర్తించినట్లు తెలుస్తోంది. దీనిపై దర్యాప్తు కొనసాగుతుండగా.. ఆ కేసుతో సంబంధం ఉన్న బ్యాంకు (మిగతా 6వ పేజీలో..)

భారీగా గంజాయి లభ్యం



పట్టుబడిన వాహనాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

6 లో

ఆఫ్‌షోర్ పూర్తిచేసే బాధ్యత నాదే

- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

టెక్కలి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఆఫ్‌షోర్ ప్రాజెక్ట్ గత ఐదేళ్ల గాలికి వదిలేశారని, దీనిని పూర్తి చేసే బాధ్యత తనదేనని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. గురువారం టెక్కలి మండలం సన్యాసినీలాపురం వద్ద మదనగోపాలసాగరం ఎత్తిపోతల పథకం పునః (మిగతా 6వ పేజీలో...)



ఎత్తిపోతల పథకాన్ని పునఃప్రారంభిస్తున్న మంత్రి అచ్చెన్న

సమాచారం

పంచారామాల సందర్శనకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

అరసవల్లి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం నుంచి ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రాలైన పంచారామాల దర్శనం కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు జిల్లా ప్రజారవాణా అధికారి ఏ.విజయకుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 'అమరావతి(అమరేశ్వరుడు), పాలకొల్లు(క్షీరరామలింగేశ్వరుడు), భీమవరం(సోమేశ్వరుడు), ద్రాక్షారామం (భీమేశ్వరుడు), సామర్లకోట(కుమార రామ భీమేశ్వరుడు) క్షేత్రాలను దర్శించుకునేలా సూపర్ లగ్జరీ, అల్ట్రాడీలక్స్, ఎక్స్‌ప్రెస్ బస్సులు నడుపుతాం. ప్రతీ ఆదివారం ఈ బస్సులు అందుబాటులో ఉంటాయి. నవంబరు 3, 10, 17, 24 తేదీల్లో సాయంత్రం 4గంటలకు శ్రీకాకుళం బస్టాండులో బయలుదేరుతాయి. పంచారామాల క్షేత్రాల సందర్శన అనంతరం తిరిగి శ్రీకాకుళం చేరుకుంటాయి. సూపర్ లగ్జరీకి ఒక్కొక్కరికి రూ.2,400, అల్ట్రాడీలక్స్‌కు రూ.2,350, ఎక్స్‌ప్రెస్‌కు రూ.2 వేలు టిక్కెట్ చార్జీలుగా నిర్ణయించాం. టిక్కెట్లను ఆన్‌లైన్‌లో లేదా డిపో కౌంటర్లలో బుక్ చేసుకోవచ్చు. భక్తులు ప్రత్యేకంగా కూడా బస్సును బుక్ చేసుకునే అవకాశం కల్పించామ'ని విజయకుమార్ తెలిపారు.

- శబరిమలైకు...

శబరిమలై యాత్రకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనున్నామని జిల్లా ప్రజారవాణా అధికారి ఏ.విజయకుమార్ తెలిపారు. ఏడు రోజుల యాత్రలో భాగంగా విజయవాడ, (మిగతా 6వ పేజీలో..)

పట్టాలెక్కనున్న.. ఉత్తరాంధ్ర-ఒడిశా రైలు



- కొత్త మార్గం ఏర్పాటుకు ప్రతిపాదనలు
- కేంద్ర రైల్వేమంత్రికి సీఎం వినతి
- సాకారమైతే సౌలభ్యమే

మెళియాపుట్టి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర-ఒడిశా రైలు మార్గం ఏర్పాటుపై మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి. శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయనగరం, ఒడిశా రాష్ట్రానికి కలుపుతూ నూతన రైల్వే మార్గం ఏర్పాటుపై గత 20 ఏళ్ల నుంచీ ప్రతిపాదనలు ఉన్నా.. ఆచరణలో మాత్రం పట్టాలెక్కడం లేదు. ప్రజలు విన్నవించినా.. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కనీసం దీని ప్రస్తావనే లేదు. కాగా.. ఇటీవల ఈ విషయమై ఢిల్లీలో కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్‌ను సీఎం చంద్రబాబు, కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు కలిశారు. ఉత్తరాంధ్ర-ఒడిశా రైలుమార్గం ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేశారు. రైల్వేశాఖ అధికారులు సైతం (మిగతా 6వ పేజీలో...)



శ్రీకాకుళంలో పోలియో నిర్మూలనపై విద్యార్థుల అవగాహన ర్యాలీ

పోలియో రహిత ప్రపంచమే లక్ష్యం

7 లో





గజలక్ష్మికి కుంకుమ పూజలు..

ఇచ్ఛాపురం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం మండలం రత్తకన్న గ్రామం నాయుడు వీధిలో గజలక్ష్మీ అమ్మవారి మహోత్సవాల్లో భాగంగా గురువారం 108 మంది మహిళలు కుంకుమ పూజలు చేశారు. అనంతరం సంబరాల కోసం ఇంటిముందు ఏర్పాటు చేసిన కలశాలను ఊరేగింపుగా తీసుకెళ్లి.. నదిలో నిమజ్జనం చేశారు.

స్ఫూర్తి కేంద్రం.. ఈ స్మృతివనం



గాలి... నీరు దేవుళ్లకు ప్రతిరూపాలైతే... వాటిని మనం స్వేచ్ఛగా అనుభవించడానికి ప్రాణాలను తృణ ప్రాయంగా త్యజించిన స్వాతంత్ర్య సమర యోధులూ దేవుళ్లే. మనకు స్వాతంత్ర్య ఫలాలను అందించిన మహాత్మా గాంధీజీ దేవుడే. మరి ఆ దేవుడికీ ఓ గుడి ఉంటే... అది భావితరాలకు స్వేచ్ఛా పాఠాలు బోధిస్తే... ఈ ఆలోచనే శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని గాంధీజీ స్మృతివనం స్థాపనకు అంకురం వేసింది. బాపూజీతో పాటు మరికొందరు స్వాతంత్ర్య సమర యోధులు... మన సంస్కృతీ సంప్రదాయాలు... భాషా పరిరక్షణకు కృషి చేసిన వారి విగ్రహాలు అక్కడ కనిపిస్తాయి.

- 105 అడుగుల ఎత్తులో రెపరెపలాడే మువ్వన్నెల జెండా
- స్వాతంత్ర్య సమర యోధులు, సంఘ సంస్కర్తల నిలయం
- శ్రీకాకుళంలో ఆకట్టుకుంటున్న వైనం


2018 సెప్టెంబరు 26... శ్రీకాకుళంలోని గాంధీ స్మారక కమిటీ ఆధ్వర్యంలో జిల్లాలోని 250 పాఠశాలలకు గాంధీజీ విగ్రహాలను పంపి ణీ చేశారు. ఆ సమయంలో కమిటీ సభ్యులకు ఓ ఆలోచన వచ్చింది. జిల్లాలో ఎక్కడైనా ఓ చోట గాంధీజీకి ఓ ఆలయం నిర్మిస్తే ఎలా ఉంటుందనేది ఆ ఆలోచన సారాంశం. వెంటనే అప్పటి కలెక్టర్ నివాస్, మున్సిపల్ కమిషనర్ ఓబులేసుతో ఈ ఆలోచనను పంచుకున్నారు. నగరంలోని శాంతినగర్ కాలనీలో నిరుపయోగంగా ఉన్న పార్కును దీని కోసం కేటాయిస్తే బాగుంటుందని సూచించారు. దీనికి కలెక్టర్, కమిషనర్ పచ్చజెండా ఊపారు. ఫలితంగా 'స్వాతంత్ర్య సమరయోధుల స్మృతివనం' రూపుదిద్దుకుంది. అక్కడే గాంధీజీకి ఆలయం వెలసింది. తొలుత నాలుగు విగ్రహాలతో ప్రారంభించారు. ప్రస్తుతం అక్కడ మొత్తం 39 మంది విగ్రహాలు ఉన్నాయి. దీని కోసం సుమారు రూ.60 లక్షలు ఖర్చయింది. మున్సిపాలిటీ నిధులతో పాటు దాతల విరాళాలతో ఇవన్నీ రూపుదిద్దుకున్నాయి. 2022 ఆగస్టు 2న 105 అడుగుల జాతీయ జెండాను ఇక్కడ ఆవిష్కరించారు. దీనికి సుమారు రూ.25 లక్షల వ్యయమైంది.

భావితరాల కోసం...

భావితరాలలో దేశభక్తిని పెంపొందించడంతో పాటు సమర యోధుల త్యాగాలను వారికి తెలియజేయాలనే లక్ష్యంతో ఈ స్మృతివనాన్ని ఏర్పాటు చేశారు. ఒకవైపు గాంధీ గుడి.. గర్భగుడిలో ధ్యాన ముద్రలో ఉన్న మహాత్ముడు దర్శనమిస్తారు. గుడి పైభాగంలో భరతమాతతో పాటు 15 అడుగుల గాంధీజీ రూపం ఆకట్టుకుంటుంది. గుడి మూల స్తంభాలపై హిందూ... ముస్లిం... క్రిస్టియన్‌మత చిహ్నాలు కనిపిస్తాయి. ఆలయానికి నలువైపులా గాంధీజీ జీవితంలోని ముఖ్య సంఘటనల చిత్రాలు స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తిని కళ్లకు కడతాయి. మరో వైపు 105 అడుగుల ఎత్తులో రెపరెపలాడుతూ ఉన్న జాతీయ జెండా మన కీర్తిని ఆకాశమంత ఎత్తున నిలబెట్టిన వైనాన్ని గుర్తు చేస్తుంది. అక్కడ కొలువుదీరిన మహనీయుల చరిత్ర చదువుతూ ఉంటే... మనం అనుభవిస్తున్న స్వాతంత్ర్య ఫలాల వెనుక ఎంతమంది త్యాగధనుల కష్టం ఉందో అవగతమవుతుంది. జిల్లాకు చెందిన స్వాతంత్ర్య సమర యోధులతో పాటు ప్రపంచాన్ని ప్రభావితం చేసిన ఎందరో మహనీయుల విగ్రహాలు అక్కడ ప్రతిష్ఠించారు. వారి జయంతి వేడుకలను క్రమం తప్పకుండా కమిటీ సభ్యులు నిర్వహిస్తున్నారు. పాఠశాల, కళాశాలల విద్యార్థులు స్వాతంత్రోద్యమ స్ఫూర్తిని, త్యాగధనుల కీర్తిని ఆకళింపు చేసుకునేందుకు ఇదో చక్కని వేదికగా చెప్పవచ్చు.



గాంధీజీ ఆలయం


105 అడుగుల ఎత్తులో రెపరెపలాడుతున్న మువ్వన్నెల జెండా

శ్రీకాకుళం అర్బన్, అక్టోబరు 24: (ఆంధ్రజ్యోతి):

మన ఉనికికి కారణం భగవంతుడని నమ్మి... ఆలయాలు నిర్మిస్తాం. మరి మనం స్వేచ్ఛా వాయువులు పీల్చడానికి కారణం గాంధీజీ అనే మానవ రూపంలోని దేవుడని కొందరి నమ్మకం. ఆ నమ్మకం నుంచి పుట్టిందే బాపూజీ ఆలయం. శ్రీకాకుళం నగరంలోని శాంతినగర్ కాలనీలో ఆ మహనీయుని ఆలయం ఉంది. నిత్యం రఘుపతి రాఘవ రాజారాం, పతిత పావన సీతారాం అంటూ అక్కడ కీర్తిస్తున్నారు. గాంధీ స్మారక నిధి బృందం పర్యవేక్షణలో గాంధీజీకి గుడి, సమర యోధులు, సంఘ సంస్కర్తల విగ్రహాలతో 'స్వాతంత్ర్య సమరయోధుల స్మృతివనం' వెలసింది. కొంతమంది సామాజిక కార్యకర్తలు జాతిపిత గుడి నిర్మాణానికి పూనుకోవడంతో అటు దాతలు, ఇటు అధికార యంత్రాంగం తోడ్పాటు అందించారు. 2021 జనవరి 30న గాంధీజీ ఆలయాన్ని స్థానికులు ప్రారంభించారు. అదే ప్రాంగణంలో స్వాతంత్ర్య సమర యోధులతో పాటు సమాజాన్ని వివిధ రూపాల్లో ప్రభావితం చేసిన సంఘ సంస్కర్తల ప్రతి రూపాలను ప్రతిష్ఠించారు.

ఇవీ విగ్రహాలు...

గర్భగుడిలో బాపూజీ... పరిసరాల్లో ఆయన రాజకీయ గురువు గోపాలకృష్ణ గోఖలే, గాంధీజీ సతీమణి కస్తూరీబా గాంధీ, భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేడ్కర్, ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్, తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, గురజాడ అప్పారావు, ఛత్రపతి శివాజీ... ఇలా అనేక మంది విగ్రహాలు ఆకర్షిస్తాయి. మానవత్వపు విలువలకు ప్రతిరూపంగా నిలిచిన మదర్ థెరిస్సా, శాంతిని ప్రబోధించిన గౌతమ బుద్ధుడు... భగత్‌సింగ్, అల్లూరి సీతారామ రాజు, అమరజీవి పొట్టి శ్రీరాములు, స్వామి వివేకానంద విగ్రహాలు కొలువుదీరాయి. శ్రీకాకుళం జిల్లా నుంచి స్వాతంత్రోద్యమంలో కీలక పాత్ర పోషించి... అనంతరం జరిగిన ఎన్నికల్లో తొలి ఎంపీగా పని చేసిన కందాల సుబ్రహ్మణ్య తిలక్, సమర యోధులు త్రిపురాన రాఘవదాసు, చౌదరి సత్యనారాయణ, సర్దార్ గౌతు లచ్చన్న, గరిమెళ్ల సత్యనారాయణ, తెలుగు వ్యవహారిక భాషా పితామహులు గిడుగు వెంకట రామ్మూర్తి దంపతులు, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్, మువ్వన్నెల జెండా రూపశిల్పి పింగళి వెంకయ్య తదితరుల విగ్రహాలు మనలో స్ఫూర్తిని రగిలిస్తాయని చెప్పవచ్చు.


సమర యోధులు...సంస్కర్తల విగ్రహాలు

'ఎస్‌బీఐ' బంగారం కేసుపై 'సీఎంవో' ఆరా!

(ఐదో పేజీ తరువాయి)

అధికారులను హుటాహుటిన సుదూర ప్రాంతాలకు బదిలీ చేయడం.. వారిని విచారణకు దూరంగా ఉంచడం.. సంబంధం లేనివారిని ఈ కేసులో చేర్చినట్లు పోలీసుల విచారణలో తేలినట్టు భోగట్టా. బ్యాంకు ఉద్యోగిని అంత్యక్రియల నిమిత్తం చెల్లించాల్సిన డబ్బులను.. 11నెలల తర్వాత ఆమె కుటుంబ సభ్యులకు పాత తేదీతో ఇచ్చేందుకు ప్రయత్నించిన బ్యాంకు అధికారుల తీరు అనుమానాలకు తావిస్తోంది. ఈ కేసు విచారణ జరుగుతుండగా.. బాధిత కుటుంబానికి న్యాయం జరిగిందా? లేదా? అని సీఎంవో కార్యాలయం నుంచి ఫోన్ వచ్చింది. కేసు పురోగతిపై ఆరా తీశారు. దీంతో ఈ కేసులో ఎప్పుడు ఏం జరుగుతుందోనన్న ఉత్కంఠ నెలకొంది.

పంచారామాల సందర్శనకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

(ఐదో పేజీ తరువాయి)

కాణిపాకం, శ్రీపురం, భవాని, పళని, ఎరుమేలి, సన్నిధానం, మధురై, రామేశ్వరం, తిరుతి, కాళహస్తి, ద్వారపూడి, అన్నవరం దర్శనం తరువాత బస్సు శ్రీకాకుళం చేరుకుంటుంది. అలాగే ఆరు రోజుల యాత్రలో భాగంగా విజయవాడ, కాణిపాకం, శ్రీపురం, భవాని, పళని, ఎరుమేలి, పంబ, సన్నిధానం, తిరుపతి, శ్రీకాళహస్తి, అన్నవరం క్షేత్రాలు సందర్శించేలా ఏర్పాట్లు చేశాం. శ్రీకాకుళం నుంచి విశాఖ దర్శిని, అరకు, శైవ క్షేత్రాల సందర్శనానికి, కోరుకున్న ప్రాంతాలకు పిక్నిక్ స్పాట్‌లకు వెళ్లేందుకు ఆర్టీసీ అద్దె ప్రాతిపదికన, అందుబాటు చార్జీలతో బస్సులు కేటాయిస్తా'మని విజయకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్లతో కలిసి కరపత్రాలను ఆవిష్కరించారు.

ఆఫ్‌షోర్ పూర్తిచేసే బాధ్యత నాదే

(ఐదో పేజీ తరువాయి)

ప్రారంభించారు. ఈ పథకం ద్వారా సాగునీటిని విడిచిపెట్టారు. అనంతరం రైతులను ఉద్దేశించి మాట్లాడారు. 'ఎట్టి పరిస్థితుల్లోనూ ఆఫ్‌షోర్‌ను పూర్తి చేస్తాం. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.460కోట్లు నిధులు కేటాయించాం. వంశధార ఇప్పటికే 74శాతం పూర్తయింది. మిగిలిన పనులు పూర్తిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కోరగా సానుకూలంగా స్పందించారు. టెక్కలి నియోజకవర్గంలో తాగునీటి వెతలు తీర్చేందుకు రూ.462కోట్లు, గ్రామీణ ప్రాంత రహదారుల నిర్మాణానికి రూ.65కోట్లు మంజూరయ్యాయి. మదనగోపాలసాగరం ఎత్తిపోతల పథకం ద్వారా శివారు ప్రాంతాకు సాగునీరు వెళ్లడం లేదని గుర్తించాం. అందుకు రూ.3.50కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసి.. డిసెంబరు తర్వాత పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం. ఉచిత ఇసుక, దీపావళికి గ్యాస్ సిలిండర్లు అందించే ప్రక్రియ చేపట్టాం. ఈ ప్రాంతంలో పోర్టు అభివృద్ధి చేసి ఉపాధి అవకాశాలు మెరుగుపరుస్తాం. మూలపేట సమీపంలో 800ఎకరాల్లో విమానాశ్రయం, మరో వెయ్యి ఎకరాల్లో ఇండస్ట్రీయల్ పార్కు ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం. ప్రత్యేకించి రూ.60వేల కోట్లతో ఆరువేల ఎకరాల్లో సంతబొమ్మాళి మండలంలోనే బీపీసీఎల్ రిఫనరీ ఏర్పాటుకు ఈ ప్రాంతం పరిశీలించాలని ముఖ్యమంత్రిని కోరా'నని మంత్రి అచ్చెన్న తెలిపారు.

హైవే విస్తరణకు రూ. 252.42 కోట్లు..

(ఐదో పేజీ తరువాయి)

నరసన్నపేట మధ్య ఆరులేన్లతో వంద కిలోమీటర్ల మేర రోడ్డు విస్తరణకు నిధులు కేటాయించాలని అప్పట్లో ఎంపీ రామ్మోహన్ నాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు కేంద్ర రోడ్డు, రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీని పలుమార్లు కలిసి ప్రతిపాదనలు అందించారు. దీంతో రూ.3వేల కోట్లు కేటాయించిన ప్రభుత్వం.. రణస్థలం మినహా మిగతా మార్గంలో నిర్మాణాలు పూర్తి చేసింది. 2014లో చేపట్టిన సర్వే ప్రకారమే భూములు, ఆస్తులు కోల్పోయిన వారికి పరిహారం ఇస్తామని చెప్పడంతో రైతులు దీనికి అంగీకరించలేదు. సమస్యను సవాల్‌గా స్వీకరించిన కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు.. బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి కేబినెట్‌లో పలుమార్లు ప్రస్తావిస్తూనే ఉన్నారు. తాజాగా కేంద్ర మంత్రిమండలి ఆమోదంతో ఏళ్లుగా పెండింగ్‌లో ఉండిపోయిన ఈ నిర్మాణాలు.. మళ్లీ పట్టాలెక్కనున్నాయి. దీనిపై ఢిల్లీ నుంచి రామ్మోహన్‌నాయుడు స్పందించారు. జిల్లా ప్రగతి భాగమైన హైవేల విస్తరణకు ఆమోదం తెలిపిన ప్రధాని నరేంద్రమోదీతోపాటు రోడ్డు, కేంద్ర రోడ్డు, రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీకి జిల్లా ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. అమరావతిలో రూ.2,245 కోట్లతో రైల్వేలైన్ ఏర్పాటుకు పచ్చజెండా ఊపడంపై హర్షం వ్యక్తం చేశారు.

పట్టా లెక్కనున్న.. ఉత్తరాంధ్ర-ఒడిశా రైలు

(ఐదో పేజీ తరువాయి)

ఈ అంశాన్ని పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరడంతో.. ఉత్తరాంధ్ర-ఒడిశా రైలుమార్గం పట్టాలెక్కే సూచనలు కనిపిస్తున్నాయని ఈ ప్రాంతవాసులు పేర్కొంటున్నారు.

ప్రతిపాదనలు ఇలా..

అధికంగా గిరిజన మండలాలు కలుపుతూ కొత్త రైల్వేమార్గం ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొందించారు. చీపురుపల్లి, రాజాం, పాలకొండ, సీతంపేట, కొత్తూరుతో పాటు ఒడిశా రాష్ట్రం పర్లాఖిమిడి ప్రాంతాలు కలుపుకొని.. మెళియాపుట్టి నుంచి పలాస లైన్‌కు కలుపుతూ ప్రతిపాదనలు సిద్ధం చేశారు. దీనివల్ల రవాణా మార్గం సులువు కానుంది. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి అవకాశం ఉంటుంది. బస్సులపై ఆధారపడి ప్రయాణిస్తున్న చాలామందికి ఊరట లభించనుంది. అంతర్రాష్ట్ర వ్యాపార లావాదేవీలు పెరిగి.. ఉపాధి అవకాశాలు దక్కనున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం కొత్త రైల్వేమార్గం అంశాన్ని పట్టించుకోలేదని జిల్లావాసులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం దీనిపై చొరవ చూపడం హర్షణీయమని పేర్కొంటున్నారు. కేంద్ర ప్రభుత్వం స్పందించి త్వరగా నూతన రైల్వే మార్గం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ఆనందంగా ఉంది..



గిరిజన ప్రాంతాలను కలుపుతూ.. కొత్త రైల్వే లైన్స్ ప్రతిపాదనలు మళ్లీ కదలడం ఆనందంగా ఉంది. గిరిజనులు తక్కువ ఖర్చుతో ప్రయాణించే అవకాశం ఉంది. ప్రజలకు కూటమి ప్రభుత్వంపై నమ్మకం ఉంది.

-లక్ష్మీనారాయణ, మాజీ ఎంపీపీ, మెళియాపుట్టి

తొలి అడుగు..



కొత్త రైల్వే లైన్స్ కోసం మొదటి అడుగు పడింది. 20 ఏళ్లుగా ఇక్కడ ప్రజలు కోరుతున్నా పట్టించుకొనే పరిస్థితి కనిపించలేదు. ఇప్పుడు సాధించుకోనే అవకాశం ఉండడంతో.. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు దృష్టికి తీసుకెళ్లాం. వారు వెంటనే కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం ఆనందంగా ఉంది. ఉత్తరాంధ్ర అభివృద్ధికి కృషి చేస్తాం.

-కలిశెట్టి అప్పలనాయుడు, ఎంపీ, విజయనగరం

భారీగా గంజాయి లభ్యం

- పర్లాఖిమిడి నుంచి పలాస తరలిస్తూ.. పట్టుబడిన వైనం

శ్రీకాకుళం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గంజాయి అక్రమ రవాణా కొనసాగుతూనే ఉంది. గత ఐదేళ్లు విచ్చలవిడిగా గంజాయి రవాణా సాగింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విస్తృత తనిఖీలు చేస్తుండగా.. పెద్దఎత్తున గంజా యి నిల్వలు పట్టుబడుతూనే ఉన్నాయి. తాజాగా గురువారం పర్లాఖిమిడి నుంచి పలాస వెళ్తున్న వాహనంలో భారీగా గంజాయి పట్టుబడినట్టు తెలిసింది. స్థానికుల వివరాల మేరకు.. మెళియాపుట్టి మండలం సవరజాడు పల్లికి చెందిన ఏసయ్య అనే వ్యక్తి పలాస నుంచి జాడుపల్లి వైపు వస్తుండగా.. వాహనం ఢీ కొట్టింది. ఏసయ్యకు గాయాలు కాగా.. గ్రామస్థులు కేకలు వేసినా వాహనాన్ని ఆపలేదు. దీంతో పక్కనే ఉన్న టీకేఆర్ పురం గ్రామస్థులకు సమాచారం ఇవ్వడంతో.. అక్కడ వారు ఆ వాహనాన్ని అడ్డు కోగా.. డ్రైవర్ వెనుదిరిగి వచ్చాడు. అప్పటికే సవర జాడుపల్లి వద్ద గ్రామస్థులు రోడ్డుపై ఉండడంతో.. వాహనాన్ని విడిచి డ్రైవర్ పరారీ అయ్యాడు. గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి వాహనాన్ని పరిశీలించగా.. సుమారు 600 కిలోలు గల గంజాయి మూటలు ఉన్నట్టు గుర్తించినట్టు సమాచారం. వాహనాన్ని పోలీ సుస్టేషన్‌కు తరలించి.. డ్రైవర్ కోసం గాలిస్తున్నట్టు తెలిసింది.

చెక్‌పోస్టు ఉన్నా.. ప్రయోజనమేదీ?

ఆంధ్రా-ఒడిశా రాష్ట్రాల సరిహద్దులో వసుంధర గ్రామం వద్ద చెక్‌పోస్టు ఉన్నా.. అక్కడ తనిఖీలు లేవు. దీంతో గంజాయిని పర్లాకిమిడి నుంచి సులువుగా దిగుమతి చేస్తున్నట్టు తెలుస్తోంది. పాతపట్నం వద్ద పోలీస్ చెక్‌పోస్టు ఏర్పాటు చేయడంతో గంజాయి రవాణాకు పర్లాఖిమిడి- పలాస మార్గాన్ని ఎంచుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పలాస నుంచి రైల్వేమార్గంలో ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారని పలువురు పేర్కొంటున్నారు. పోలీసులు మరింత నిఘా పెట్టాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు.

ఫటా ఫట్ — అప్పుడు పలకరించావా?



రాష్ట్రంలో ఎక్కడ మహిళలపై ఏ ఘటన జరిగినా కూటమి ప్రభుత్వం నిందితులపై చర్యలు తీసుకుంటోంది. కాశీబుగ్గలో బాలికలపై జరిగిన అత్యాచార ఘటనపై కూడా యంత్రాంగం చర్యలు తీసుకుంది. అధికారంలో ఉన్నన్నాళ్లు నీవు (జగన్‌ను ఉద్దేశించి) ఎప్పుడైనా, ఏ కుటుంబాన్నికైనా పలుకరించావా? గడిచిన ఐదేళ్లలో ఆసుపత్రుల్లో వైద్యులు లేరు. మందులు లేవు. ఇప్పుడేమో జగన్ నంగనాచి కబుర్లు చెబుతున్నాడు. నిన్ను, నీ కబుర్లను ప్రజలు నమ్మే స్థితిలో లేరు. రాష్ట్రంలో అభివృద్ధిని అడ్డుకున్న ఘనత జగన్‌మోహన్‌రెడ్డిదే. రాష్ట్రాన్ని గంజాయి హబ్‌గా మార్చేసిన ఘనత కూడా ఆయనదే. రివర్స్ టెండరింగ్ పేరిట పోలవరం ప్రాజెక్టును నాశనం చేశాడు.

-టెక్కలి సభలో గురువారం రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు



మిస్టర్ ఆంధ్రా పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

'మిస్టర్ ఆంధ్రా'కు మనోళ్లు

శ్రీకాకుళం స్పోర్ట్స్, అక్టోబరు 24: మిస్టర్ ఆంధ్రా బాడీ బిల్డింగ్ పోటీలకు జిల్లా క్రీడాకారులను ఎంపిక చేసినట్లు శ్రీకాకుళం బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు బలగ ప్రసాద్, కార్యదర్శి వి.విజయ్‌కుమార్ తెలిపారు. నగరంలోని గోపాల్ జిమ్‌లో గురువారం జిల్లా స్థాయి ఎంపికలను నిర్వహించారు. ఇందులో ఎంపికైన వారు విజయనగరంలో ఈ నెల 27న జరుగనున్న పోటీలకు హాజరవుతారని పేర్కొన్నారు. శ్రీకాకుళంలో చేపట్టిన ఎంపికల్లో 55 కేజీల విభాగంలో పి.రాజేష్, 60 కేజీలలో ఎం.రఫీ ఖాన్, కె.సుమంత్, 65 కేజీల్లో డి.గణేష్, ఎస్.రాజు, 55 కేజీలలో ఆర్.హరీష్ (ఆమదాలవలస), 70 కేజీలలో ఆర్.గణేష్, మాస్టర్ కేటగిరిలో ఎ.భాస్కరరావులు ఎంపికయ్యారు. వారికి జిమ్ అధినేత గోపాల్, టీమ్ కోచ్ కె.గౌరీశంకర్ అభినందించారు.

'దానా' ప్రభావం లేనట్టే!

- ఈ ఒక్కరోజు గడిస్తే చాలు
- స్వల్పంగా ఈదురుగాలులు
- వేకువజాము వరకూ ఉద్దానం ప్రజల్లో ఆందోళన
- ఒడిశా వైపు మళ్లిన తుఫాన్

శ్రీకాకుళం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన తుపాను 'దానా' ప్రభావం... శ్రీకాకుళం జిల్లాపై పెద్దగా కనిపించలేదు. తుఫాన్ ప్రభావం తీవ్రంగా ఉంటుందనే హెచ్చరికలతో సరిహద్దు నియోజకవర్గమైన ఇచ్ఛాపురం, కంచిలి, కవిటి, సోంపేట మండలాల ప్రజలు రెండు రోజులుగా కంటిమీద కునుకు లేకుండా గడిపారు. అధికార యంత్రాంగం మొత్తం తుఫాన్ పట్ల అప్రమత్తంగా ఉండాలంటూ హెచ్చరికలు జారీ చేయడంతో పాటు సహాయ చర్యలకు ప్రత్యేక బృందాలను గ్రామాలకు పంపించారు. తుఫాన్ దిశ మార్చుకుని.. పూర్తిగా ఒడిశా వైపు వెళ్లిపోవడంతో గురువారం ఎటువంటి ప్రభావం కనిపించలేదు. దీంతో ఉద్దానం ప్రజలు కొంత ఉపశమనం పొందారు. శుక్రవారం ఒక్కరోజు గడిస్తే చాలని దేవుళ్లను మొక్కుకుంటున్నారు.

● స్వల్పంగా ఈదురుగాలులు..

తుఫాన్ ప్రభావంతో గురువారం స్వల్పంగా ఈదురుగాలులు వీచాయి. ఉదయం నుంచి ప్రారంభమై.. సాయంత్రం, రాత్రి కొద్దిగా బలంగా వీచాయి. తుఫాన్ వల్ల ముందుగా నష్టం వాటిల్లేది విద్యుత్ శాఖకే. ఈ విషయాన్ని గుర్తించి... తీర ప్రాంత మండలాల పొడవునా.. ఏపీఈపీడీసీఎల్ అధికారులు పర్యటించారు. స్తంభాలు ఎలా ఉన్నాయన్నదీ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గురువారం రాత్రి వరకూ ఎక్కడా ఎటువంటి నష్టం వాటిల్లలేదు. శుక్రవారం కూడా ప్రశాంతంగానే ఉంటుందని.. తుఫాన్ ప్రభావం జిల్లాపై అంతగా ఉండదని స్పష్టత రావడంతో కలెక్టరేట్ నుంచి కూడా ఎటువంటి ప్రకటనా వెలువడలేదు.

● బస్సులు కిటకిట..

తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో శ్రీకాకుళం జిల్లా మీదుగా ఒడిశా, పశ్చిమ బెంగాల్ వెళ్లే రైళ్లన్నీ రద్దు చేశారు. దీంతో ఒడిశాతో పాటు సమీప ప్రాంతాలకు వెళ్లేందుకుగాను జిల్లా వాసులు బస్సులపైనే ఆధారపడ్డారు. జిల్లాలో అన్ని ఆర్టీసీ కాంప్లెక్సులు కిటకిటలాడాయి. ప్రైవేటు వాహనాలు సైతం కిక్కిరిసిపోయాయి. మొత్తానికి తుఫాన్ గండం గట్టెక్కిందనే వార్తలు జిల్లా వాసులకు ఎంతో ఊరటనిచ్చాయి.

రాష్ట్ర పండగగా 'రథసప్తమి'

అరసవల్లి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య ప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామి జన్మదినం అయిన సూర్యజయంతి (రథసప్తమి) వేడుకలు ఏటా జిల్లాలో ఘనంగా నిర్వహిస్తారు. మాఘమాసంలో శుక్లపక్షం, సప్తమి తిథి రోజున ఈ పండుగను జరుపుకుంటారు. అరసవల్లిలో అంగరంగ వైభవంగా జరిగే రథసప్తమి వేడుకలకు రాష్ట్రం నలుమూలల నుంచే కాక, ఇతర రాష్ట్రాల నుంచి, విదేశాల నుంచి కూడా భక్తులు తరలివస్తారు. అంతటి విశిష్టత కలిగిన రథసప్తమి పండుగను రాష్ట్ర పండుగగా ప్రకటించాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, ముఖ్యమంత్రి చంద్రబాబుకు వినతి పత్రం అందజేశారు. దీనికి ముఖ్యమంత్రి ఆమోద ముద్ర వేసినట్లు, ఇప్పటికే ప్రధాన కార్యదర్శికి ఆదేశాలు కూడా ఇచ్చినట్లు ఎమ్మెల్యే గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. త్వరలోనే అధికారిక ఉత్తర్వులు జారీ అవుతాయని వివరించారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 4వ తేదీన అరసవల్లిలో రథసప్తమి వేడుకలను రాష్ట్ర పండుగగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు.

కంట్రోల్ రూం ఏర్పాటు

ఇచ్ఛాపురం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): తుఫాన్ హెచ్చరికల దృష్ట్యా ప్రజలకు అందుబాటులో కంట్రోల్ రూం ఏర్పాటు చేయడం జరిగిందని తహసీల్దార్ ఎన్.వెంకటరావు తెలిపారు. రానున్న రెండు మూడు రోజుల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అత్యవసరమైతే తప్పా ప్రజలు బయటకు రావద్దని తెలిపారు. టోల్ ఫ్రీ నెంబరు 91141 15363 కు ఫోన్ చేయాలన్నారు.

8న వినికిడి పరికరాల పంపిణీ

అరసవల్లి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): దీన్ దయాళ్ శ్రావణ ఫౌండేషన్, విజయవాడ, నేషనల్ హెల్త్ మిషన్ వారి సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో నవంబరు 8న ఉచిత వినికిడి పరికరాల పంపిణీ క్యాంపు నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో బొడ్డేపల్లి మీనాక్షి, ప్రోగ్రాం అధికారి డాక్టర్ వెంకట్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉచిత వినికిడి పరికరాల కోసం మెడికల్ క్యాంపు రోజు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, పాస్‌పోర్టు సైజు ఫొటోలు-2, ప్రభుత్వం జారీ చేసిన టోన్ ఆడియోమెట్రీ రిపోర్టు, సదరం సర్టిఫికెట్, ఈఎన్‌టీ వైద్యుని ప్రిస్క్రిప్షన్ తీసుకురావాలని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సాగుహక్కు కల్పించాలి

ఎచ్చెర్ల, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): చిలకపాలెం గ్రామానికి ఆనుకుని ఉన్న నారాయణపురం భూములను సాగుచేస్తున్న రైతులకు సాగు హక్కు కల్పించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పి.తేజేశ్వరరావు అన్నారు. చిలకపాలెంలో గురువారం నిర్వహించిన సీపీఎం మహాసభలో ఆయన మాట్లాడారు. నారాయణపురం భూములను తరతరాలుగా సాగుచేస్తున్న రైతులకు పట్టాలు ఇచ్చి సాగు హక్కు కల్పించాలన్నారు. విద్యుత్ చార్జీల సర్దుబాటు ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు తోనంగి నందోడు, పి.చంద్రరావు, జి.కృష్ణారావు, పి.కవిలేశ్వరరావు, కోరాడ అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

రోస్టర్ విధానం పాటించాలి

పొందూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీలో ఎస్ఎస్ఏ అధికారులు రోస్టర్ విధానాన్ని పాటించాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పూజారి హరిప్రశన్న కోరారు. సర్వశిక్ష అభియాన్ అధికారులు అర్ధరాత్రి విడుదల చేసిన సీఆర్టీ, పీజీటీ, పీటీఐ తదితర పోస్టుల నియామకపు ప్రొవిజనల్ మెరిట్ జాబితాలో మెరిట్ కమ్ రోస్టర్ విధానం పాటించకపోవడం శోచనీయమన్నారు. 1:3 నిష్పత్తిలో కాకుండా మెరిట్ జాబితా 1:20 నిష్పత్తిలో పెట్టడం సరికాదన్నారు. జాబితాలో తప్పులను సవరించాలని కోరారు.

ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్ చేయించుకోండి

గుజరాతీపేట, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి పదో తరగతి పూర్తయిన వెంటనే ఎంప్లాయిమెంట్ కోసం రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి కె.సుధ అన్నారు. స్థానిక మహిళా కళాశాలలో ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్ డ్రైవ్‌ను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉద్యోగవకాశాల కోసం స్టేట్ పోర్టల్‌లో, నేషనల్ కెరీర్ ఫర్ సర్వీసెస్ పోర్టల్‌లో తమ పేరును నమోదు చేసుకోవాలన్నారు. మూడేళ్ల కోసారి రెన్యూవల్ చేసుకోవాలన్నారు. సమయానికి చేసుకోకపోతే ఆరు నెలల గ్రేస్ పీరిడ్ ఉంటుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.సూర్య చంద్రరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పి.సూర్యసునీత, సంతోష్‌కుమార్, ఎంఎన్ పాఠక్, ఎం.రోహిని తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి

గార, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): దానా తుఫాన్ పట్ల అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారిణి శాంతిశ్రీ అన్నారు. గురువారం సాయంత్రం తీర ప్రాంత గ్రామమైన బందరువానిపేటలో తుఫాన్ రక్షిత భవనాన్ని ఆమె పరిశీలించారు. చేపలవేటకు వెళ్లొద్దని దండోరా వేయించాలన్నారు. తహసీల్దార్ ఎస్.రమణరావు, ఎంపీడీవో ఎస్.రా మ్మోహనరావు ఉన్నారు.

ఫిషింగ్ హార్బర్ పనులు వేగవంతం చేయాలి

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ఎచ్చెర్ల, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): బుడగట్ల పాలెం సముద్రతీరంలో రూ.370 కోట్లతో నిర్మిస్తున్న ఫిషింగ్ హార్బర్ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. హార్బర్ పనులను ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావుతో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. హార్బర్ పనులను చేపడుతున్న సంస్థ ప్రతినిధులు, రెవెన్యూ, అటవీ శాఖాధికారులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. హార్బర్‌కు కేటాయించిన 40.84 ఎకరాల స్థలంలో అటవీ శాఖకు సంబంధించి రెండు ఎకరాలను మినహాయించి మిగిలిన పనులను వేగవంతం చేయాలన్నారు. ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు మాట్లాడుతూ హార్బర్ నిర్మాణం పూర్తయితే ఈ ప్రాంత మత్స్యకారులకు వలస సమస్య పరిష్కారమవుతుందన్నారు. అలాగే ఈ ప్రాంత రూపురేఖలు పూర్తిగా మారిపోతాయన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో సాయి ప్రత్యూష, మత్స్యశాఖ ఉప సంచాలకులు శ్రీనివాసరావు, టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి, టీడీపీ మండల అధ్యక్షుడు బెండు మల్లేశ్వరరావు, సర్పంచ్ అల్లుపల్లి రాంబాబు, కూటమి నేతలు విశ్వక్సేన్, పైడి ముఖలింగం తదితరులు పాల్గొన్నారు.



బుడగట్లపాలెం తీరంలో పర్యటిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే తదితరులు

బీమాను వినియోగించుకోవాలి

శ్రీకాకుళం కలెక్టరేట్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రానున్న రబీ పంటలకు సంబంధించి పంటల బీమా పథకాన్ని రైతులందరూ వినియోగించుకోవాలని వ్యవసాయశాఖ చీఫ్ సెక్రటరీ బుడితి రాజశేఖర్ అన్నారు. పంటల బీమాపై గురువారం ఆయన కలెక్టర్లు, వ్యవసాయశాఖ అధికారులతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, వ్యవసాయ శాఖ అధికారులు ఈ కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ.. పంటల బీమాకు సంబంధించి ఇతరుల ప్రమేయం లేకుండా రైతులే నేరుగా నేషనల్ క్రాప్ ఇన్సూరెన్స్ పోర్టల్ ద్వారా ప్రీమియం కట్టుకోవచ్చని, లేకుంటే గ్రామ సచివాలయంలో చెల్లించవచ్చన్నారు. పంటల బీమా వల్ల కలిగే ఉపయోగాలు రైతులకు వివరించాలన్నారు. రబీకి సంబంధించి జీడిపంటకు నవంబరు 15వ తేదీ, ఇతర పంటలకు డిసెంబరు 15వ తేదీలోగా చెల్లించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయధికారి త్రినాథస్వామి, సీసీవో ప్రసన్నలక్ష్మి, డీసీసీబీ సీఈవో వరప్రసాద్, పలు బీమా కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

డీఆర్వోగా వెంకటేశ్వరరావు

శ్రీకాకుళం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా రెవెన్యూ అధికారి(డీఆర్వో)గా ఎం.వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా పలువురు డిప్యూటీ కలెక్టర్‌లను, జిల్లా రెవెన్యూ అధికారులను ప్రభుత్వం గురువారం బదిలీ చేస్తూ ఉత్తర్వులను జారీ చేసింది. సింహాచలం దేవస్థానం అధికారిగా విధులు నిర్వహిస్తూ.. అక్కడ నుంచి బదిలీపై శ్రీకాకుళం డీఆర్వోగా నియమితులైన వెంకటేశ్వరరావు.. కొన్నేళ్ల కిందట టెక్కలి ఆర్డీవో విధులు నిర్వహించారు. ఆ తర్వాత విశాఖ, రంపచోడవరం ప్రాంతాల్లో పనిచేశారు. ప్రస్తుతం కలెక్టరేట్‌లో అటవీ సెటిల్‌మెంట్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న ఎం.అప్పారావు.. ఇన్‌చార్జి డీఆర్వోగా వ్యవహరిస్తున్నారు.

ఐక్యరాజ్య సమితి ఆవిర్భావ దినోత్సవం

గుజరాతీపేట, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఐక్యరాజ్యసమితి ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.సూర్యచంద్రరావు మాట్లాడుతూ.. అంతర్జాతీయ చట్టం, భద్రత, ఆర్థిక అభివృద్ధి, సామాజిక అభివృద్ధి, మానవ హక్కుల సమష్టి కృషి చేసేందుకు దేశాలు ఏర్పాటు చేసుకున్న ఒక అంతర్జాతీయ సంస్థ ఐక్యరాజ్య సమితి అని అన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు పి.శంకరనారాయణ, సీహెచ్ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

బోరు మరమ్మతు చేయండి

ఆమదాలవలస, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘ పరిధిలోని పదో వార్డు హడ్కో కాలనీలో తాగునీటి బోరుకు మరమ్మతులు చేపట్టాలని మాజీ కౌన్సిలర్ గొల్లపల్లి సింహాద్రి కోరారు. కొన్నేళ్లుగా బోరు మూలకు చేరిందని పలుమార్లు ప్రజా ప్రతినిధులకు, మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. బోరు అడుగు భాగం తుప్పు పట్టి పాడైందని వాపోయారు. ఎమ్మెల్యే రవికుమార్ స్పందించి చొరవ తీసుకోవాలని కోరారు.

వ్యాసరచన పోటీలు

పొందూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పొందూరు పోలీసుల ఆధ్వర్యంలో వావిలపల్లిపేట మోడల్ స్కూల్ విద్యార్థులకు గురువారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అమర వీరుల వారోత్సవాల్లో భాగంగా ఈ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఎస్‌ఐ వి.సత్యనారాయణ పరిశీలించారు.

సెంటర్ పార్కింగ్ ఏర్పాటుకు ప్రణాళిక



పరిశీలిస్తున్న డీఎస్పీ, కార్పొరేషన్ అధికారులు

శ్రీకాకుళం క్రైం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): సిక్కోలు నగరంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు పెరిపోతుంది. వాహనాలకు పార్కింగ్ స్థలాలు లేకపోవడంతో మరింత సమస్య నెలకొంది. నగరపాలక కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారులతో సమన్వయం చేసుకుని ఓ మాస్టర్ ప్లాన్‌ను సిద్ధం చేయాలని డీఎస్పీ వివేకానందకు ఎస్పీ ఆదేశించారు. దీంతో గురువారం రాత్రి అరసవల్లి మిల్లు జంక్షన్ నుంచి ఏడు రోడ్ల కూడలి వరకు రోడ్లను డీఎస్పీ, కమిషనర్ ప్రసాద్, టౌన్ ప్లానింగ్ అధికారులు పరిశీలించారు. పార్కింగ్ స్థలాలు లేకపోవటాన్ని గుర్తించారు. యుద్ధ ప్రాతిపదికన మిల్లు జంక్షన్ నుంచి ఏడు రోడ్ల కూడలి వరకు సెంటర్ డివైడర్ పార్కింగ్ లైన్లు ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. అలాగే ఫుట్‌పాత్‌లు ఆక్రమించడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందని తక్షణ తొలగించాలని వ్యాపారులను ఆదేశించారు. ట్రాఫిక్ సీఐ నాగరాజు, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ సుధీర్‌కుమార్ ఉన్నారు.

'దానా'పై ఎమ్మెల్యే సమీక్ష



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్

కవిటి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): దానా తుఫాన్‌పై ఎమ్మెల్యే బి.అశోక్ మండల స్థాయి అధికారులతో గురువారం సమీక్షించారు. రామయ్యపుట్టుగలోని తన స్వగృహం వద్ద తహసీల్దార్, ఎంపీడీవో, ఇరిగేషన్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఇచ్ఛాపురం నియోజకవర్గంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. గురువారం రాత్రి నుంచి వర్షాలతో పాటు గాలులు వీచే అవకాశం ఉన్నందున తీసుకోవాల్సి జాగ్రత్తలపై వివరించారు. విద్యుత్ సరఫరా నిలిచిపోతే అవసరమైన జనరేటర్లు సిద్ధంచేయాలని ఆదేశించారు. అలాగే ప్రత్యేకాధికారి ఆర్‌వీ ప్రసాద్‌తో కలసి మండల స్థాయి అధికారులతో కవిటి తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. కవిటి, కంచిలి, ఇచ్ఛాపురం, సోంపేట మండలాల అధికారులు పాల్గొన్నారు.

● ఇచ్ఛాపురం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో అధికారులంతా ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో సమీక్షించారు. అన్నింటిని అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి, ప్రత్యేకాధికారులు జగన్మోహన్‌రావు, సల్లా శ్రీనువాసరెడ్డి, తహసీల్దార్ ఎన్.వెంకటరావు, ఎంపీడీవో రామారావు, మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్, సీఐ ఎం.చిన్నంనాయుడు, ఎస్‌ఐలు చిన్నంనాయుడు, శ్రీనువాసరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

జమిలి ఎన్నికలు ప్రజాస్వామ్యానికి తీవ్ర విఘాతం



సెమినార్‌లో మాట్లాడుతున్న వక్తలు

గుజరాతీపేట, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు, స్థానిక సంస్థలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించే జమిలి ఎన్నికల విధానం భారత ప్రజాస్వామ్యానికి, ఫెడరల్ స్ఫూర్తికి తీవ్ర విఘాతం కలిగిస్తుందని, ఈ నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. స్థానిక బాపూజీ కళామందిర్‌లో గురువారం 'ప్రజాస్వామ్య భారతం - జమిలి ఎన్నికలు' అనే అంశంపై గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వీజీకే మూర్తి అధ్యక్షతన సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం జమిలి ఎన్నికలతో ఖర్చు తగ్గించవచ్చని, పరిపాలనపై దృష్టిసారించవచ్చనని మాయమాటలు చెబుతోందన్నారు. వాస్తవానికి మతతత్వ కార్పొరేట్ విధానం నిరాటంకంగా కొనసాగించుకోవడానికే జమిలి ఎన్నికలను ముందుకు తీసుకువచ్చారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ, కథా రచయిత అట్టాడ అప్పలనాయుడు, వివిధ సంఘాల నుంచి కె.రామ్‌గోపాల్, కె.ఈశ్వరరావు, ఎస్.నరసింహమూర్తి, కె.వేణుగోపాల్, సీహెచ్ రవీంద్ర, మెహబుల్లాఖాన్, పి.తేజేశ్వరరావు, బి.హరీష్ ప్రసంగించగా, నిర్వాహకులు ఎం.ప్రభాకరరావు, పి.సుధాకరరావు, ఆర్.మధు, కేఎస్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటాలి

గుజరాతీపేట, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మొక్కలు భావితరానికి మెట్లని డీపీఆర్వో బాలమాన్ సింగ్ అన్నారు. స్థానిక పీఎస్ఎన్ ఎంహెచ్ పాఠశాల ప్రాంగణంలో శ్రీకాకుళం డ్రైవర్స్ వెల్ఫేర్ సంఘం మొదటి వార్షికోత్సవం సందర్భంగా ప్రాంగణంలో గురువారం మొక్కలు నాటారు. వార్షికోత్సవం సందర్భంగా మొక్కలు నాటడడం, రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయడం విశేషమన్నారు. హెచ్ఎం బలివాడ భాస్కరరావు, వైటీహెచ్ జిమ్ నిర్వాహకులు చంద్రమౌళి, జుంబాడాన్స్ ఫౌండర్ బి.దేవి ప్రసాద్‌లతో కలిసి మొక్కలు నాటారు. ఎస్.జోగినాయుడు, డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్.గణపతి, కార్యదర్శి పి.నరేష్, కె.రాము, బి.శంకరరావు పాల్గొన్నారు.

నైరలో తాగునీటి పరీక్షలు

శ్రీకాకుళం రూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): నైర గ్రామ పంచాయతీలో నీటి పారుదల విధానాన్ని ఎంపీడీవో శైలజ, సర్పంచ్ రామప్రతాప్‌తో కలిసి గురువారం పరిశీలించారు. మండలంలోని దాదాపు 80 గ్రామాలకు నైర సీపీడబ్ల్యూఎస్ పథకం ద్వారా తాగునీటి సరఫరా అవుతుండటంతో నీటి పరీక్ష చేపట్టారు.

బలోపేతానికి కృషి చేయాలి

కంచిలి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): స్వయం శక్తి సంఘాల బలోపేతానికి సభ్యులంతా కృషి చేయాలని ఏపీఎం ఎస్.ప్రసాద్ అన్నారు. గురువారం గ్రామాల్లో గల సంఘాల పని తీరును ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో వీవోఏలు పార్వతి, మోహిని పాల్గొన్నారు.

యూజీసీ నిధులకు వినతి

ఎచ్చెర్ల, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీకి యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) నుంచి రావల్సిన నిధులు విడుదల చేయించాలని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడును వర్సిటీ రిజిస్ట్రార్ సుజాత కోరారు. ఈ మేరకు గురువారం న్యూ ఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిసి వినతి పత్రం అందించారు. యూజీసీ నుంచి రూ.2.5 కోట్లు విడుదల కావల్సి ఉందన్నారు. అలాగేయూజీసీ అధికారులను కూడా కలిసినట్టు ఆమె చెప్పారు.

సభ్యత్వ లక్ష్యాలు చేరుకోవాలి

జి.సిగడాం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): సభ్యత్వ లక్ష్యాలను చేరుకోనేలా ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు కుమరాపు రవికుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రూ.100 చెల్లించి టీడీపీ సభ్యత్వం తీసుకున్నవారికి మట్టి ఖర్చులకు రూ.10 వేలు, రూ.5లక్షలు ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు టంకాల మౌళీశ్వరరావు, కూనుబిల్లి కూర్మారావు, కుదిరెళ్ల బుజ్జి, కంచరాన సూరన్నాయుడు, కోన వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

సోంపేట, అక్టోబర్ 24(ఆంధ్రజ్యోతి): తఫాన్ నేపథ్యంలో మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని ప్రత్యేకాధికారి అజయ్ కార్తికేయ కోరారు. మండలంలో తీరప్రాంతాల్లో గురువారం పర్యటించి మత్స్యకారులకు తగిన సూచనలిచ్చారు. ఈయన వెంట తహసీల్దార్ బి.అప్పల స్వామి రెవెన్యూ అధికారులు ఉన్నారు.

పోలియోరహిత ప్రపంచమే లక్ష్యం

అరసవల్లి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పోలియోరహిత ప్రపంచమే లక్ష్యంగా రోటరీ క్లబ్ ఆఫ్ శ్రీకాకుళం ఆధ్వర్యంలో గురువారం నగరంలో అవగాహన ర్యాలీ జరిగింది. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ పి.సత్యవాణి, మున్సిపల్ హెల్త్ అధికారి డాక్టర్ సుధీర్ కుమార్, రోటరీ క్లబ్ అధ్యక్షుడు ముని శ్రీనివాసరావు పర్యవేక్షణలో జరిగింది. పోలియో వ్యాధి నిర్మూలనకు రోటరీ ఇంటర్నేషనల్ 2023 నాటికి రూ.17వేల కోట్లు విరాళం ఇవ్వడం జరిగిందని, ప్రపంచ వ్యాప్తంగా ఇప్పటివరకు 99 శాతం పోలియో నిర్మూలించడం జరిగిందన్నారు. ఈ ర్యాలీ ఏడు రోడ్ల జంక్షన్ నుంచి సూర్యమహల్ జంక్షన్ వరకు సాగింది. జెమ్స్ మెడికల్ కళాశాల, నగరంలో ఓ ప్రైవేట్ కళాశాల విద్యార్థినులు, జిల్లా సెక్రటరీ డి.శివశంకర్, దూసి సంతోష్, ట్రెజరర్ పసగాడ సూర్య, మంత్రి వెంకటస్వామి, దూసి సంతోష్, పబ్లిక్ ఇమేజ్ చైర్మన్ ఎంఆర్‌కే దాస్, వసంతరావు, సందీప్, వారణాసి సందీప్ పాల్గొన్నారు.

పరిహారం చెల్లించేలా చర్యలు

ఎచ్చెర్ల, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): డి.మత్స్యలేశం గ్రామంలో కోడ కొర్లయ్య, గురుమూర్తిలకు చెందిన చేపలు వేటాడే వలలు ఇటీవల దగ్ధమైన విషయం తెలిసిందే. నష్టపోయిన బాధితులను ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు గురువారం పరామర్శించారు. అగ్ని ప్రమాదానికి కారణమైన నిందితులను శిక్షించేలా పోలీసు వారిని సూచిస్తానని ఎమ్మెల్యే చెప్పారు. అదే విధంగా బాధితులకు నష్టపరిహారం చెల్లించేలా కృషిచేస్తానన్నారు. కూటమి నేతలు పాల్గొన్నారు.

మెప్మా అర్బన్ మార్కెట్లతో ఆర్థిక తోడ్పాటు

శ్రీకాకుళం అర్బన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): స్థిరమైన ఆర్థిక తోడ్పాటుకు మెప్మా అర్బన్ మార్కెట్లు దోహదం చేస్తాయని శ్రీకాకుళం నగర పాలక సంస్థ కమిషనర్ పీవీవీడీ ప్రసాదరావు అన్నారు. స్థానిక రైతుబజార్ దరి నిర్వహించిన మెప్మా అర్బన్ మార్కెట్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. పట్టణ స్వయం సహాయక సంఘాల మహిళా సభ్యులు తయారు చేసే ఉత్పత్తులకు గిట్టుబాటు కల్పించేందుకుగాను ఈ కామర్స్ నెట్‌వర్క్ (ఓఎన్‌డీసీ) ద్వారా ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. పట్టణ మహిళా సమాఖ్యల అధ్యక్షులు కె.నాగలక్ష్మి వి.వెంకటలక్ష్మి, మెప్మా సీఎంఎం ఎస్ వెంకటరావు, బి.భాస్కరరావు, బి.రామారావు, వి.విజయకుమారి తదితర సిబ్బంది మహిళలు పాల్గొన్నారు.



వరుణ్ ఐనాక్స్	-	వైజాగ్
సిఎమ్ఆర్ ఐనాక్స్	-	వైజాగ్
చిత్రాలయ ఐనాక్స్	-	వైజాగ్
మీరజ్	-	వైజాగ్
TA TA AC DTS	-	తగరపు వలస
సినీపోలిస్	-	మధురవాడ
వి. శేష్	-	గాజువాక
సిఎమ్ఆర్ ఐనాక్స్	-	గాజువాక
పివిఆర్ శ్రీకన్య	-	నర్సీపట్నం
ఎన్‌సిఎస్ ఐనాక్స్	-	విజయనగరం
ఎల్‌జిటి సినిమాస్	-	విజయనగరం
కీర్తిక	-	శ్రీకాకుళం

29న జిల్లాస్థాయి సివిల్ సర్వీసెస్ క్రీడా పోటీలు

శ్రీకాకుళం స్పోర్ట్స్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ శాఖలలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఈ నెల 29వ తేదీన జిల్లా స్థాయి సివిల్ సర్వీసెస్ క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కె.శ్రీధర్ తెలిపారు. ఈ పోటీలు స్థానిక కోడి రామ్మూర్తి స్టేడియంలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఆసక్తిగల ఉద్యోగులు వారి ఆధార్ కార్డు, ఉద్యోగ గుర్తింపు కార్డుపై అధికారి ధ్రువీకరణతో ఈ నెల 29న స్టేడియంలో ఉదయం తొమ్మిది గంటలకు హాజరుకావాలన్నారు. మహిళలు, పురుషుల నైపుణ్యం ఆధారంగా ఎంపిక చేసి వారికి రాష్ట్రస్థాయి సివిల్ సర్వీసెస్ క్రీడా పోటీలకు పంపనున్నట్లు పేర్కొన్నారు. ఇతర వివరాలకు క్రీడల ఇన్‌చార్జి ఎం.మాధరీలతను సంప్రదించాల్సిందిగా కోరారు.

పక్కా భవనంలోకి అంగన్‌వాడీ కేంద్రం

పొందూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): సొంతభవనంలేని కృష్ణాపురం (గారపేట) అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎమ్మెల్యే చొరవతో నీడ దొరికింది. ప్రవేట్ భవనంలో చాలీచాలని ఇంటిలో నిర్వహిస్తున్న ఈ కేంద్రాన్ని ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆదేశాల మేరకు గ్రామంలో ఖాళీగా ఉన్న పక్కా భవనంలోకి మార్చారు. ఇటీవల వరకు రేకుల షెడ్డులో ఈ కేంద్రం నిర్వహించడంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని చిన్నారుల తల్లిదండ్రులు భయపడేవారు. ఇప్పుడు కొత్త భవనంలోకి మార్పు చేయడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

ఆర్థిక సాయం

కవిటి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): చింతామణి ట్రస్టు, హైదరాబాదు వారు కవిటిలోని పారిశుధ్య కార్మికుని కుమారుడు జానకిరావుకు గురువారం ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ విద్యార్థి ఇంజనీరింగ్ రెండో సంవత్సరం చదివేందుకు తమ వంతుగా రూ.40వేలు అందించారు. అలాగే ఇంటర్మీడియట్ చదువుతున్న ఎస్.హాసినికి రూ.20వేలు సాయాన్ని అందించారు. కార్యక్రమంలో గ్రామస్థులు బి.రమేష్, ఎ.మధు, పి.శేఖర్, బి.కామరాజు, ఎ.రాజు, పి.లక్ష్మణమూర్తి తదితరులు ఉన్నారు.

వత్సవలసకు ఎత్తిపోతల పథకం

అరసవల్లి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): గార మండలం వత్సవలస పంచాయతీ పరిధిలోని 350 ఎకరాలకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించేందుకు ఎత్తిపోతల పథకం ఏర్పాటుకు, అలాగే శ్రీకాకుళం కార్పొరేషన్‌లో విలీన పంచాయతీలకు ఉపాధి నిధులు విడుదల చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు, వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడులను ఎమ్మెల్యే శంకర్ కోరారు. ఇందుకు వారు సానుకూలంగా స్పందించి త్వరలో ఆమోదముద్ర వేయనున్నారని ఎమ్మెల్యే శంకర్ హర్షం వ్యక్తం చేశారు. మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానన్నారు.

నిర్మించారు.. వదిలేశారు

- ప్రారంభోత్సవానికి నోచుకోని వైనం
- ఇదీ ఆర్బీకే, షోర్ స్టేషన్ భవనం దుస్థితి

గార, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బందరువానిపేట, శాలిహుండాంలో గత ప్రభుత్వ హయాంలో నిర్మాణం పూర్తయినా రెండు భవనాలు ప్రారంభానికి నోచుకోలేదు. బందరు వానిపేటలో రూ.10 లక్షలు వ్యయంతో చేపల వేటకు వెళ్లే మత్స్యకారులకు వాతావరణం సమచారం తెలియ జేసే షోర్ స్టేషన్ భవనం నిర్మించి వదిలేశారు. శాలి హుండాం కొండ పక్కనే రూ. 21.50 లక్షలు వ్యయంతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం భవనం (ఆర్బీకే) కూడా దాదాపు నిర్మాణం పూర్తి దశకు చేరుకుంది. ఈ రెండు భవనాలు ప్రారంభానికి ఎదురుచూస్తున్నాయి. ఆర్బీకే భవనం ప్రారంభం కాకపోవడంతో ఎరువులు, ఇతర సామగ్రి కోసం రైతులు ఇబ్బంది పడుతున్నారు. షోర్ స్టేషన్ భవనం అందుబాటులోకి వస్తే తుపాన్లు, విపత్తుల సమయంలో తమకు సకాలంలో సమాచారం అందుతుందని ఆశించిన మత్స్యకారులకు నిరాశే మిగిలింది.ఈ రెండు భవనాల పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకు పూర్తిస్థాయిలో బిల్లులు చెల్లించకపోవడంతోనే ప్రారంభించడానికి చర్యలు చేపట్టడంలేదని సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు చెబుతున్నారు. తక్షణమే కూటమి ప్రభుత్వంలో ఈ రెండు భవనాలకు సంబంధించి పూర్తిస్థాయిలో బిల్లులు చెల్లించి వినియోగంలోకి తీసుకురావాలని మత్స్యకారులు, రైతులు కోరుతున్నారు.


శాలిహుండాం కొండ పక్కనే నిర్మాణం పూర్తి చేసుకున్న ఆర్బీకే భవనం

వేర్వేరు ఘటనల్లో నలుగురి మృతి

జిల్లాలో గురువారం వేర్వేరు ఘటనల్లో నలుగురు మృతిచెందారు. పాము కాటేయడంతో ఓ మహిళ, పురుగులు, గడ్డి మందు తాగి మరో ముగ్గురు చికిత్సపొందుతూ చనిపోయారు. ఈమేరకు పోలీసులు కేసులు దర్యాప్తుచేస్తున్నారు.

పాముకాటుకు గురై మహిళ..

నందిగాం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటిపల్లికి చెందిన వివాహిత కోనారి జయలక్ష్మి(24) చికిత్సపొందుతూ గురువారం మృతిచెందింది. సోమవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తుండగా పాముకాటు వేయడం గుర్తించి చికిత్స నిమిత్తం టెక్కలి, అక్కడ నుంచి మెరుగైన వైద్యంకోసం శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి తరలించారు.అక్కడ చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతిచెందింది. జయలక్ష్మికి భర్త భువనేశ్వరరావుతోపాటు కార్తీక్, హర్ష కుమారులు ఉన్నారు. భర్త ఫిర్యాదు మేరకు మహిళ ఏఎస్ఐ కె.వరలక్ష్మి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

గడ్డిమందు తాగి..

నందిగాం మండలంలోని నౌగాంగ్రామానికి చెందిన వివాహిత కొన్ని సావిత్రి(35) చికిత్సపొందుతూ గురువారం ఉదయం మృతిచెందింది పోలీసుల కథనం మేరకు.. సావిత్రి రెండేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతోంది. గర్భసంచి, ఇతర శస్త్రచికిత్సలు చేశారు. ఇంతలో మతిస్థిమితం కోల్పోయింది. దీంతో బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డిమందుతాగి అపస్మారక స్థితికి చేరుకుంది. గుర్తించిన భర్త తవుడు, కుటుంబసభ్యులు చికిత్సనిమిత్తం టెక్కలి తరలించారు.పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడ నుంచి శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతిచెందింది. సావిత్రికి కుమారుడు ఉన్నారు. సోదరుడు దాసరి ముఖలింగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంట్లో గొడవపడి వృద్ధుడు..

కోటబొమ్మాళి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని భగీరదపురానికి చెందిన మెట్ట అప్పారావు (71) చికిత్సపొందుతూ గురువారంమధ్యాహ్నం మృతిచెందాడు. పోలీసులు,స్థానికుల కథనం మేరకు.. అప్పారావు బుధవారం సాయంత్రం ఇంట్లో గొడవపడ్డాడు. ఆ సమయంలో పురుగులమందు పట్టుకొని కొండలవైపు వెళ్లి ఓ చెట్టు కింద తాగాడు. సమీపంలో ఉన్న గ్రామస్థులు చూసి పరుగు పరుగున వెళ్లి ఇంటికి తీసుకువచ్చి నీళ్లు తాగించారు. అప్పటికే అపస్మారకస్థితికి వెళ్లి పోవడంతో హుటాహుటినా శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అయితే అప్పారావు చికిత్స పొందుతూ గురువారం మధ్యాహ్నం మృతిచెందాడు. ఈమేరకు ఎస్ఐ సత్యనారాయణ కేసు నమోదు చేశారు. కాగా అప్పారావుకు భార్య శాంతమ్మ, కుమారులు విఘ్నేశ్వరరావు, దుర్గారావు, కుమార్తె పుష్పలతలు ఉన్నారు.

వ్యక్తిగత సమస్యలతో ఇబ్బందిపడుతున్న వ్యక్తి..

రణస్థలం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): బండిపాలెం గ్రామానికి చెందిన అమర్ అయ్యప్ప(34) చికిత్సపొందుతూ మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. అయ్యప్ప కొన్నాళ్లగా వ్యక్తిగత సమస్యలతో ఇబ్బందిపడుతున్నారు. ఈ క్రమంలో ఈనెల 21న పురుగుల మందుతాగాడు. అపస్మారక స్థితికి చేరుకున్న అయ్యప్పను చికిత్స నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. అయ్యప్పకు ఇద్దరు పిలలు, భార్య దివ్య ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోద చేసినట్లు జేఆర్ పురం ఎస్ఐ చిరంజీవి తెలిపారు.

రైలు ఢీకొని రెండు పశువులు మృతి

పాతపట్నం,అక్టోబరు24:(ఆంధ్రజ్యోతి) పాతపట్నంలోని నీలకంఠేశ్వరాలయం సమీపంలో రాజ్యరాణి ఎక్స్‌ప్రెస్ రైలుఢీకొన్న ఘటనలో రెండు పశువులు మృతిచెందాయి. స్థానికుల కథనం మేరకు.. గురువారం ఉప్పరవీధిలోని డెంగ్రేటి రాముకు చెందిన ఆవులను నీలకంఠేశ్వరుని ఆలయం సమీపంలో మేపుతున్నారు. ఆ సమయంలో పాతపట్నం నుంచి గుణుపూరు వెళ్లే రాజ్యరాణి రైలు నాలుగు చూడి ఆవులను ఢీకొంది. దీంతో అక్కడికక్కడే రెండుఆవులు మృతి చెందాయి. తీవ్రంగా గాయపడిన రెండు ఆవులకు పశుసంవర్ధకశాఖ ఏడీ మంచు కరుణాకరరావు పశువైద్యులు సిబ్బంది సేవలందించారు. ఇంతలో ఒక ఆవు పరిస్థితి విషమంగా ఉంది. ఈ మేరకు పలాస రైల్వేపోలీసులకు సమాచారం ఇచ్చారు. తమను ఆదుకోవాలని రాము కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

పోలీసుశాఖలో వేధింపుల కలకలం


శ్రీకాకుళం క్రైం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఓ మహిళా కానిస్టేబుల్‌పై ఎస్ఐ లైంగిక వేధింపుల ఘటన జిల్లా పోలీసు వర్గాల్లో కలకలం రేపింది. జిల్లా కేంద్రానికి సమీపంలో ఓ నియోజకవర్గ పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న తనను తరచూ లైంగిక వేధింపులకు గురిచేయడంతో పాటు ఐదు రోజుల కిందట విధి నిర్వహణలో భాగంగా ఉద్దేశపూర్వకంగానే నడి వీధిలో అసభ్యకరంగా తాకుతూ ఎస్ఐ వికృత చేష్టలకు పాల్పడ్డారంటూ ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డికి ఆ మహిళా కానిస్టేబుల్ ఫిర్యాదు చేసింది. ఈ ఘటనపై ఎస్పీ ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. తక్షణం విచారణకు స్పెషల్ బ్రాంచ్ పోలీసులను ఆదేశించారు. ఇప్పటికే విచారణ కూడా పూర్తి కాగా, ఆ ఎస్ఐపై పలు ఆరోపణలు గుప్పు మంటున్నాయని ఎస్పీకి అందించిన నివేదికలో పేర్కొన్నట్టు సమాచారం. అయితే ఇటీవల ఆ పోలీసు స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ సైతం ఆ ఎస్ఐ పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. ఈ విషయంపై ఎస్పీని వివరణ కోరగా.. ఫిర్యాదు రావడం వాస్తవమేనని, శాఖాపరమైన విచారణకు ఆదేశించామన్నారు. ప్రజలకు సేవలందించాల్సిన బాధ్యతా, జవాబుదారి గల వృత్తిలో ఉంటూ మహిళలపై వేధింపులకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు.

ఆటో బోల్తా పడి పదిమందికి గాయాలు

పలాస, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పలాస సమీపంలోగల జాతీయరహదారిపై కంబిరిగాం జంక్షన్ బైపాస్ రోడ్డులో కూలిపనులకు వెళ్తుండగా గురువారం ఉదయం ఆటో బోల్తాపడిన సంఘటనలో డ్రైవర్‌తో సహా పదిమంది గాయపడ్డారు. పలాస మండలంలోని పెద్దనారాయణపురానికి చెందిన చింతల పార్వతి, సుశీల, జమున, అన్నపూర్ణ, పార్వతీ, తులసమ్మ, జి.లక్ష్మి, సీహెచ్ వనజాక్షితో పాటు డ్రైవరు ఎ.నాగేశ్వరరావు ఆటోలో పలాస కూలీ పనులకు వస్తున్నారు. ప్రమాదవశాత్తు కంబిరిగాం జంక్షన్‌లో బోల్తాపడింది. దీంతో గాయపడిన వారిని హైవే అంబులెన్స్‌లో పలాస ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీరిలో చింతల పార్వతి పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో జిల్లా ఆసుపత్రికి రిఫర్‌చేశారు. సంఘటన స్థలాన్ని కాశీబుగ్గ పోలీసులు పరిశీలించారు. ఈమేరకు కేసు నమోదుచేశారు.

శిలాఫలకం ధ్వంసం చేయడంపై కేసు నమోదు

హరిపురం,అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి): మందస మండలంలోని అల్లిమెరక వద్ద ఇటీవల ఎమ్మెల్యే గౌతు శిరీష రూ.39.80.లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి వేసిన శిలాఫలకం బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. శిలాఫలకం పగిలి పైభాగం మొత్తం పాడైంది. ఈశిలాఫలకం రోడ్డు పక్కనే ఉండడంతో ఆ సమయంలో వాహనాలు రావడంతో ఆ వ్యక్తులు వెళ్లిపోయారని, ఇది స్థానిక వైసీపీ కార్యకర్తల పనేనని టీడీపీ నాయకులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు అల్లిమెరక కూటమి నాయకులు మందస పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


శిలాఫలకం ధ్వంసం చేసిన దృశ్యం

ఎస్టీ మాకివలసలో అట్రాసిటీ కేసు దర్యాప్తు

జలుమూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎస్టీ మాకివలస గ్రామస్థులు హరేరామ హరేకృష్ణ సభ్యులపై ఫిర్యాదు మేరకు అట్రాసిటీకేసుపై శ్రీకాకుళం అదనపు ఎస్పీ (క్రైం) పి.శ్రీనివాసరావు గురువారం గ్రామంలో దర్యాప్తు చేశారు. ఫిర్యాదుచేసిన వారితోపాటు గ్రామస్థులు, హరేరామ హరేకృష్ణ సభ్యులతో మాట్లాడి స్టేట్‌మెంట్లను రికార్డుచేశారు.నివేదికను జిల్లా అధికారులకు నివేదిస్తున్నట్లు శ్రీనివాసరావు తెలిపారు.

ప్రభుత్వోన్నత పాఠశాలలో దొంగతనం

నరసన్నపేట, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వోన్నత పాఠశాలలో గురువారం రాత్రి దొంగతనం జరిగిందని హెచ్‌ఎం పి.వెంకట్రావు తెలిపారు. పాఠశాలలో వంటగది తాళం కోసి అల్యూమినియం పాత్రలు, గ్యాస్ బండ, ఎండీఎం కోసం కొనుగోలు చేసిన సుమారు రూ.15వేలు విలువ చేసే కిరాణ సామగ్రి ఎత్తుకుపోయారని వంటఏజెన్సీ నిర్వాహకులు రాధ చెప్పారు. ఈమేరకు నరసన్నపేట పోలీసులకు సమాచారం ఇచ్చామని హెచ్‌ఎం వెంకట్రావు తెలిపారు.

కార్తీక మాసానికి ఏర్పాట్లు చేయండి: అచ్చెన్న

టెక్కలి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రావివలస ఎండలమల్లన్న ఆలయంలో కార్తీక మాసం నాలుగు సోమవారాలు లైటింగ్ సౌకర్యం కల్పించాలని, భక్తులకు ఉచితంగా పులిహోరా ప్రసాదం,మజ్జిగ, తాగునీరు తదితర ఏర్పాట్లు చేయాలని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కోరారు. ఆలయంలో పరిశుభ్రత పాటించాలని, భక్తులకు ఇబ్బందులు కలగకుండా దర్శన సౌకర్యాలు కల్పించాలని ఈవో జి.గురునాధరావుకు ఆదేశించారు.కార్తీక మొదటి సోమవారానికి రూ. 63లక్షలతో నౌపడా-మెళియాపుట్టి రోడ్డు నుంచి రావివలస ఆలయ ముఖద్వారం వరకు రోడ్డు పనులు పూర్తిచేయాలని ఆదేశించారు.ఈ మేరకు గురువారం రావివలస జంక్షన్‌లో ఈ రహదారి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఉత్సవకమిటీ ఏర్పాటుపై ప్రతిపాదనలు చేయాలని దేవాదాయశాఖ ఏసీ ప్రసాద్‌పట్నాయక్‌కు సూచించారు.రావివలస జడ్పీ ఉన్నతపాఠశాలను పరిశీలించి మైదానం ఇలాగే ఉంటుందా, దీన్నిబట్టి మండలం ఎలా ఉందో అర్థమవుతుందని ఎంఈవో తులసీరావుపై అసహనం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో కింజరాపు ప్రసాద్, ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి, తహసీల్దార్ దిలీప్ చక్రవర్తి, ఎంపీడీవో లక్ష్మీభాయి,ఎల్ఎల్ నాయుడు, టెక్కలి, నందిగాం మండల పార్టీల అధ్యక్షులు బగాది శేషగిరి, పినకాన అజయ్‌కుమార్, మట్ట సుందరమ్మ, బడే జగదీష్, నర్తు కృష్ణ, వాసు, ఇప్పిలి జగదీష్, సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.


రావివలసలో ఆర్‌అండ్‌బీ రోడ్డు శంకుస్థాపన చేసిన మంత్రి

- టెక్కలిలో గోశాలను మంత్రి అచ్చెన్నాయుడు పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎవరైనా పట్టణంలో రోడ్లపై గోవులను వదిలితే వాటిని ఇక్కడకు తీసుకువస్తారని, యజమాని తన గోవు అని వస్తే పదివేల రూపాయల అపరాధ రుసుము విధిం చాలని తెలిపారు. టెక్కలిలో అద్దె భవనాల్లో ఉన్న ప్రభుత్వకార్యాలయాల వివరాలు సేకరించాలని ఆర్డీవో ఎం.కృష్ణమూర్తికి ఆదేశించారు. ఆయా భవనాలను పాత ఆసుపత్రిలో ఏర్పాటుచేయడం ద్వారా ప్రభుత్వ కార్యాలయాలన్నీ ఒకే దగ్గర ఉండడంతోపాటు అద్దె భారం తగ్గుతుందని తెలిపారు.

నాణ్యమైన ఇసుక అందించడమే ధ్యేయం

కొత్తూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పారదర్శక విధానంతో నాణ్యమైన ఇసుక అందించడమే కూటమి ప్రభుత్వం ధ్యేయమని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తెలిపారు. గురువారం మండలంలోని నివగాం, ఆకుల తంపర ఇసుక ర్యాంప్‌లు ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇసుక అక్రమ వ్యాపారంలో వైసీపీ ప్రభుత్వం రూ.50 వేల కోట్ల ప్రజాధనం కొల్లగొట్టిందని ఆరోపించారు.కార్యక్రమంలో ఆర్డీవో కృష్ణారావు, సర్పంచ్ నాగళ్ల అప్పన్న, అగతముడి అరుణ్, మాతల గాంధీ, ఎంపీడీవో నీరజ, పోతుల రాజు, శ్రీధర్, చోడవరపు రాము, సిరుసువాడ సర్పంచ్ పోలినాయుడు పాల్గొన్నారు.


ఇసుక ర్యాంప్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

టీడీపీ సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలి

- నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

నరసన్నపేట, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి కోరారు. గురువారం పట్టణంలో టీడీపీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శనివారం నుంచి పార్టీ సభ్యత్వ నమోదు ప్రారంభించనున్నట్లు తెలిపారు. అనారోగ్యానికి గురైన నడగాం గ్రామానికి చెందిన పొట్నూరు ప్రసాదరావు కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.70వేలు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ బగ్గు అర్చన, పార్టీ మండలాధ్యక్షులు శిమ్మ చంద్రశేఖర్, కింజరాపు రామారావు, గొద్దు చిట్టిబాబు, జెవర రాము, సాసుపల్లి కృష్ణబాబు, పీస కృష్ణ, జామి వెంకట్రావు, ఉణ్న వెంకటేశ్వరరావు, బోయన సతీష్, ఆనంద్ పాల్గొన్నారు.

- పోలాకి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వం తీసుకున్న ప్రతి కార్యకర్తకు ప్రమాదబీమా వర్తిస్తుందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు. గురువారం ఈదులవలస జంక్షన్‌లో జరిగిన కార్యకర్తల శిక్షణ శిబిరంలో పరిశీలకుడిగా హాజరై మాట్లాడారు. పార్టీ మండలాధ్యక్షుడు ఎంవీ నాయుడు అధ్యక్షతన జరిగిన సభ్యత్వ శిక్షణ కార్యక్రమంలో సభ్యత్వ నమోదు నిర్వాహకురాలు బగ్గుఅర్చన సభ్యత్వ నమోదుపై వివరించారు. కార్యక్రమంలో సభ్యత్వ శిక్షకులు లీలామోహన్, ఎంవీనాయుడు, తమ్మినాన భూషణరావు, ఆరికేనాయుడు, బి.అర్చన బైరిబాస్కరరావు, కరుకోలరమేష్‌బాబు పాల్గొన్నారు.


పోలాకి: మాట్లాడుతున్న ఎమ్మెల్యే బగ్గురమణమూర్తి

వినూత్నంగా జనసేన ఫ్లెక్సీల ఏర్పాటు

మెళియాపుట్టి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పాతపట్నం నియోజకవర్గంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జన్మదినం పురస్కరించుకుని పలుచోట్ల ఏర్పాటు చేసిన బ్యానర్లు చింపివేయడంపై జనసేన నాయకులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఇటీవల మెళియాపుట్టి మండలంలోని ఆకుల అమ్మవారి ఆలయం సమీపంలో,హిరమండలం, పాతపట్నం, మెళియాపుట్టి తదితర ప్రాంతాల్లో జనసేన నాయకులు ఏర్పాటుచేసిన బ్యానర్ చింపివేయడంపై పోలీసులకు ఆ పార్టీ నాయకులు ఫిర్యాదుచేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో గురువారం ఆకుల అమ్మవారి ఆలయం వద్ద బ్యానర్లు చింపుతున్న లేదా చింపిస్తున్న ఆడంగి వేదవలు, గాడిదలాగ పనిచేస్తు కుక్కలాగా శునకానందం పొందుతున్న వారికి జనసేన తరపున ఇవే మా కానుకలు అని బ్యానర్లు వినూత్నంగా ఏర్పాటుచేశారు. బ్యానర్లు చింపివేయడంపై ఇప్పటికే డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకువెళ్లినట్లు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చైతన్య తెలిపారు.


వినూత్నంగా బ్యానర్ ఏర్పాటుచేసిన జనసేన నాయకులు

మహిళా రైతు సంఘాలు బలోపేతం చేయాలి

- జిల్లా ఫార్మర్ ప్రొడ్యూస్ గ్రూపు ఏపీఎం ఈశ్వరరావు


మాట్లాడుతున్న ఈశ్వరరావు

పలాస రూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మహిళా రైతు సంఘాలు బలోపేతం కావాలని, ప్రకృతి, సేంద్రీయ వ్యవసాయంపై దృష్టిసారించాలని జిల్లా ఫార్మర్ ప్రొడ్యూస్ గ్రూపు ఏపీఎం కె.ఈశ్వరరావు కోరారు. గురువారం పలాస వెలుగు కార్యాలయంలో రైతు ఉత్పత్తిదారుల సంఘాల బలోపేతం, శిక్షణ కార్యక్రమంలో భాగంగా మహిళాసంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సేంద్రీయ వ్యవసాయంపై సంఘాలు అవగాహన పెంచుకోవాలని కోరారు. ఐదురోజుల పాటు జరిగే శిక్షణను 250 మహిళా సంఘాల సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో మండలం ఫార్మర్ ప్రొడ్యూస్ గ్రూపునకు చెందిన అప్పలనర్సమ్మ, జనరల్ ఏపీఎం జాంభవతి, అకౌంటెంట్ పి.కల్యాణి, కోశాధికారి రేణంకి సుగుణ, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

అర్హులకు ఇళ్లను అందించాలి

పలాస, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి):హుద్‌హుద్ ఇళ్లను అర్హత ఉన్న లబ్ధిదారులకు పారదర్శకంగా అందించాలని జనసేన నాయకులు కేదార్, గిరీష్, శ్రీకాంత్, దీనాజ్యోతిపాత్రో కోరారు.ఈ మేరకు మునిసిపల్ కమిషనర్ ఎన్.రామారావుకు గురువారం వినతిపత్రం అందించారు.

పశువులను గోశాలకు తరలిస్తాం: కమిషనర్

పలాస, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పశువులను రోడ్లపైకి విడిచిపెడితే కేసులు నమోదు చేయడంతో పాటు వాటిని గోశాలకు తరలిస్తామని మునిసిపల్ కమిషనర్ ఎన్.రామారావు హెచ్చరించారు. గురువారం పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీలోని పశువుల కాపర్లు, యజమానులతో సమావేశం ఏర్పాటు చేశారు.

లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

టెక్కలి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): టెక్కలి కోర్టుల సముదాయంలో డిసెంబరు 14న జరిగే జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకొని ఎక్కువ కేసులు రాజీకి సహకరించాలని జూనియర్ సివిల్ న్యాయాధికారి సీహెచ్ హరిప్రియ కోరారు. గురువారం టెక్కలి కోర్టుల పరిధిలోని న్యాయవాదులు, పోలీస్ అధికారులతో వేర్వేరుగా సమావేశాలు నిర్వహించారు. సమావేశంలో బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు దివ్వల వివేకానంద, న్యాయవాదులు, టెక్కలి, నందిగాం, మెళియాపుట్టి స్టేషన్ల పోలీసులు, టెక్కలి ఎక్సైజ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ప్రొటోకాల్ ఉల్లంఘనపై వాగ్వాదం

వజ్రపుకొత్తూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రొటోకాల్ ఉల్లంఘనపై వైసీపీ, టీడీపీ సభ్యుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. గురువారం జరిగిన మండల సమావేశంలో ఎంపీపీ ఉప్పరపల్లి నీలవేణి కార్యాలయంలో మాజీ సీఎం జగన్, మాజీమంత్రి అప్పలరాజు ఫ్లెక్సీలు తొలగించి సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పోటోలు ఏర్పాటు చేయాలని పీఏసీఎస్ మాజీ చైర్మన్ దువ్వాడ హేంబాబుచౌదరి కోరారు. ఈ విషయంపై మండల ప్రత్యేక ఆహ్వానితుడు ఉప్పరపల్లి ఉదయకుమార్ అభ్యంతరం వ్యక్తం చేయడంతో సభలో వాడివేడిగా చర్చజరిగింది. ఫ్లెక్సీల వ్యవహారంపై వాడివేడిగా చర్చ జరుగుతుండడంతో ఎంపీడీవో ఎన్.రమేష్‌నాయుడు స్పందించి నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ఫ్లెక్సీలు తొలగిస్తామని చెప్పడంతో సభ్యులు శాంతించారు. కాగా దువ్వాడ హేంబాబుచౌదరి సభ్యుడు కాకపోయినా హాజరై మాట్లాడడం విశేషం. సమావేశంలో వైస్‌ఎంపీపీలు రాజు, శ్రావణి పాల్గొన్నారు.

బాలల సంరక్షణపై దృష్టి సారించాలి

పాతపట్నం అక్టోబరు 24:(ఆంధ్రజ్యోతి): బాలికల సంరక్షణపై ప్రత్యేకదృష్టి సారించాలని ఎంపీడీవో చంద్రకుమారి కోరారు. గురువారం పాతపట్నంలో బాలలరక్షణ మండలకమిటీ సమా వేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్‌కుమార్, వైద్యాధికారులు శివ పాల్గొన్నారు.

తుఫాన్‌పై అప్రమత్తంగా ఉండాలి

మెళియపుట్టి, అక్టోబరు,24 (ఆంధ్రజ్యోతి): దానా తుఫాన్‌పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి ఎల్.మధుబాబు తెలిపారు. గురువారం రట్టిణి గ్రామాన్ని పరిశీలించారు. ఒడిశాలో వర్షాలు కురిస్తే మహేం ద్రతనయ నది పొంగే ప్రమాదముందని తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ పాపారావు, ఎంపీడీవో ప్రసాద్‌పండా ఉన్నారు.

- పలాస రూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి):పలాస మండలంలోని బ్రాహ్మణతర్లా, అమలకుడియాలో లోతట్టు ప్రాంతాలు, వరహాలగెడ్డ పరిసరాలను ఎంపీడీవో వసంత్‌కుమార్, ఈవోపీఆర్‌డీ మెట్ట వైకుంఠరావు, సచివాలయ అధికారులు గురువారం పరిశీలించారు.
- నందిగాం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఉయ్యాలపేట గ్రామాన్ని మండల ప్రత్యేకాధికారి గోపిబాల, తహసీల్దార్ పి.సోమేశ్వరరావు, ఎంపీడీవో టి.రాజారావు పరిశీలించారు అనంతరం అధికారులు సీతానగరంలోని ప్రాథమిక పాఠశాలను ఉయ్యాల పేట గ్రామస్థుల కోసం పునరావాస కేంద్రంగా గుర్తించారు.
- వజ్రపుకొత్తూరు,అక్టోబరు,24 (ఆంధ్రజ్యోతి): దానా తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో తహసీల్దార్ సీతారామ్మూర్తి, డీటీ మురళి, ఆర్ఐ వెంకటరావు తీర ప్రాంత గ్రామాల్లో పర్యటించారు. మత్స్యకారులు సముద్రంలో చేపలవేటకు వెళ్ళవద్దని దండోరా వేయించారు.

ముంపునకు గురయ్యే ప్రాంతాల్లో డ్రోన్ సర్వే

జలుమూరు, అక్టోబరు,24 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావం వల్ల భారీ వర్షాలు కురిసి ముంపునకు గురయ్యే ప్రాంతాల్లో డ్రోన్ సర్వే నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జె.రామారావు తెలిపారు.మండలంలోని కొమనాపల్లి, అచ్యుతాపురం, సురవరం, నగిరికటకం తదితర గ్రామాల్లో నదీపరివాహక ప్రాంతంలో గురువారం డ్రోన్ సర్వే నిర్వహించారు.

వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

బూర్జ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఓ మహిళ ఇంటికి రమ్మని చెప్పి గురువారం వ్యక్తిపై దాడికి పాల్పడినట్టు ఫిర్యాదు అందినట్టు ఎస్ఐ ప్రవల్లిక తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. విజయనగరం జిల్లా డెంకాడ గ్రామానికి చెందిన కలవకోట ప్రసాద్ విజయనగరంలోని ఓ ట్రాన్స్‌పోర్టు కంపెనీలో పనిచేస్తున్నాడు. ఇతడికి బూర్జ మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళతో తొమ్మిది నెలల కిందట పరిచయం ఏర్పడింది. ఈ ఏడాది మార్చి నుంచి మే వరకు ఆమదాలవలసలోని పూజారిపేటలో ఒక ఇంటిని అద్దెకు తీసుకుని నివాసం ఉంటున్నారు. కొద్ది నెలలుగా వారిమధ్య తగాదాలు రావడంతో.. 15 రోజుల కిందట ఆమె తన కన్నవారింటికి వెళ్లిపోయింది.ఈ క్రమంలో బుధవారం ఆ మహిళ ప్రసాద్‌కు ఫోన్ చేసి మాట్లాడుకుందాం.. ఆమదాలవలస రమ్మని చెప్పింది. దీంతో ఆమదాలవలస చేరుకున్న ప్రసాద్ మధ్యాహ్నం రెండు గంటల వరకు ఎదురుచూడగా.. ఎంతకీ రాకపోవడంతో ఆమె స్వగ్రామానికి వెళ్లి పిలిచాడు. ఆమె దుర్భాషలాడడమే కాకుండా బాత్‌రూమ్ కడిగే యాసిడ్ ప్రసాద్‌పై పోసింది. దీంతో నా ముఖం, కాళ్లకు గాయాలయ్యాయని, దాడికి పాల్పడిన ఆమెపై చర్యతీసుకోవాలని ప్రసాద్ పోలీసులకు ఫిర్యాదుచేశారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ప్రవల్లిక తెలిపారు.

10 మంది పేకాటరాయుళ్ల అరెస్టు

పొందూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): సింగూరు సమీపంలో బుధవారం రాత్రి ఒంటి గంట సమయంలో నిర్వహించిన దాడిలో 10 మంది పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్టు పోలీసులు తెలిపారు. పక్కాసమాచారం మేరకు ఎస్ఐ వి.సత్యనారాయణ సిబ్బందితో సింగూరు సమీపంలో నాగావళి నది ఒడ్డున పేకాట శిబిరంపై దాడి చేశారు. ఈ సమయంలో పేకాట శిబిరం వద్ద ఉన్న 10 మందిని అరెస్టుచేసి వారి నుంచి రూ.1,50,520 నగదు, తొమ్మిది సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేశారు.

ఉప్పు పరిశ్రమను ఆదుకోవాలి

సంతబొమ్మాళి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నౌపడ ఉప్పు పరిశ్రమను ఆదుకొని పూర్వ వైభవం తీసుకురావాలని జిల్లా పౌరహక్కుల సంఘ అధ్యక్షుడు పత్తిరా దానేష్ కోరారు. గురువారం నౌపడ ప్రాంతంలో పౌరహక్కుల సంఘం ఆధ్వర్యంలోపర్యటించి రైతులతో మాట్లాడారు.కార్యక్రమంలో సహాయ కార్యదర్శి యు.సోమనాథం, పిట్ట జోగారావు, తెప్పల ఢిల్లీరావు, పోతనపల్లి వైకుంఠరావు, లక్ష్మణ్, పోలారావు పాల్గొన్నారు.

శ్మశానవాటికకు రహదారి నిర్మించాలి

కొత్తూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పారాపురంలో దళితులు వినియోగించే శ్మశాన వాటికకు రహదారి నిర్మించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శిర్ల ప్రసాద్, దళిత నాయకులు కింజరాపు సింహాచలం, జి.రామారావు, కొర్రాయి రవి, యందవ రవికుమార్ కోరారు. గురువారం పారాపురంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ పలుసార్లు ప్రజా ప్రతినిధులు, అధికారులకు తెలియజేసినా నేటికీ శ్మశానానికి వెళ్లడానికి రహదారి సమస్యను పరిష్కారం కాలేదని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో దళితులు గోపి, సింహాచలం, శంకర్, రామారావు, రామకృష్ణ, శ్రీను, రమణ పాల్గొన్నారు.

ట్రస్టు బోర్డుల్లో చోటు కల్పించడంపై హర్షం

కోటబొమ్మాళి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): తమకు ఆలయాల ట్రస్టు బోర్డుల్లో చోటు కల్పించడంపై నాయీబ్రాహ్మణుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నౌగాపు నాగరాజు హర్షం వ్యక్తం చేశారు. గురువారం కోటబొమ్మాళిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ టీడీపీప్రభుత్వం నాయీ బ్రాహ్మణుల అభివృద్ధి, సంక్షేమంపై తీసుకున్న నిర్ణయంతో రాష్ట్రంలో కొన్ని ప్రాంతాల్లో దుర్భజీవితాన్ని అనుభవిస్తున్న తమకు ఇది మార్గదర్శకంగా ఉంటుందన్నారు. సమావేశంలో చిగురువలస సూర్యనారాయణ, కనకరాజు, నరేష్, శంకరరావు, బొమ్మాళి కృష్ణారావు, కూర్మాపు శిమ్మయ్య, వింజాంపాడు అప్పారావు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రం పరిశీలన

పలాస రూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణతర్లాలో ఆధార్ కేంద్రాన్ని ఎంపీడీవో వసంత్‌కుమార్ గురువారం పరిశీలించారు. కొత్త ఆధార్, సవరణ, పేర్లు మార్పు వంటి అంశాలపై ఆధార్ కేంద్రాల్లో మార్పులు చేసుకోవాలని కోరారు.ఆయన వెంట ఈఓపీఆర్‌డీ వైకుంఠరావు,సచివాలయ సిబ్బంది ఉన్నారు.

- కాశీబుగ్గ, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి):కాశీబుగ్గ పాత జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న కీర్తిరాయి చెరువును పర్యాటకపరంగా అభివృద్ధి చేయాలని జనసేన పార్టీ సమన్వయ కర్త దుర్గారావు కోరారు.ఈ మేరకు కీర్తిరాయి చెరువును పరిశీలించారు.

ముఖలింగేశ్వరస్వామి హుండీ లెక్కింపు

జలుమూరు, అక్టోబరు 24: (ఆంధ్రజ్యోతి) శ్రీముఖలింగేశ్వర స్వామి హుండీ ఆదాయం 86 రోజులకు 2,02,758 రూపాయలు వచ్చినట్లు ఈవో పి.ప్రభాకరరావు తెలిపారు. స్వామివారి హుండీ గురువారం ఆమదాలవలస గ్రూపు దేవాలయాల నిర్వహణాధికారి టి.రవి సమక్షంలో లెక్కించినట్లు చెప్పారు.

పశుగణన సమర్థవంతంగా నిర్వహించాలి

పాతపట్నం, అక్టోబరు24:(ఆంధ్రజ్యోతి): అఖిలభారత పశుగణన సమర్థవంతంగా నిర్వహించాలని పశుసంవర్ధకశాఖ ఏడీ మంచు కరుణాకరరావు కోరారు. గురువారం పాతపట్నంలోని ప్రాంతీయ పశువైద్యశాలలో పాతపట్నం మెళియాపుట్టి మండలాల పరిధిలోని పశువైద్యులు, సిబ్బందితో 21వ అఖిలభారత పశుగణనపై సమీక్షించారు.సమావేశంలో పశువైద్యులు బి శ్రీవాణి, పి.అనిల్, కె.మౌనిక పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం

మెళియాపుట్టి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సమస్యలపై దశలవారీగా పోరాటం చేస్తామని ఎమ్మెల్సీ రఘువర్మ తెలిపారు.గురువారం పెద్దలక్ష్మీపురం, కరజాడ, భరణికోట, పెద్దమడి, చాపర పాఠశాలల పరిశీలించారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

టెక్కలి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఉపాధ్యాయులు ఓటరుగా నమోదు చేసుకోవాలని యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షులు కురమాన దాలయ్య తెలిపారు. మండలంలో వివిధ ఉన్నతపాఠశాలలు, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఎంజేపీ రెసిడెన్షల్ స్కూల్స్‌ను యూటీఎఫ్ మండల ప్రధానకార్యదర్శి టి.వైకుంఠరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలవలస ధర్మారావుతో కలిసి సందర్శించారు.

- హిరమండలం: ప్రతి ఉపాధ్యాయుడు ఓటరుగా నమోదు కావాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చౌదరి రవీంద్ర కోరారు. గురువారం సుభలయ ఆర్‌ఆర్ కాలనీ ప్రాథమికోన్నత పాఠశాలలో సమావేశాన్ని నిర్వహించారు.